PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 317 | విజయవాడ, ఆదివారం 18 జూన్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 18 June 2023 | Rs

తండ్రి ఆస్తిలో ఆడబిడ్డలకూ హక్కు

- హైకోర్టు తీర్పు

లోపలి పేజీలో..



సాత్విక్-చిరాగ్ జోడి రికార్డు

- ప్రపంచ టూర్ సూపర్-1000 ఫైనల్‌కు తొలిసారి
- సింగిల్స్‌లో ప్రణయ్ రాయ్ ఓటమి

లోపలి పేజీలో..

మరో 2 రోజులు తీవ్ర వడగాడ్పులు

నేడు 109, రేపు 73 మండలాల్లో..

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న రెండురోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రతతోపాటు పలు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు ప్రభావం చూపనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ నెల 18న 109 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 206 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న 73 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 227 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశముందని తెలిపారు. 18వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9, అనకాపల్లి 6, బాపట్ల 8, తూర్పుగోదావరి 17, ఏలూరు 12, గుంటూరు 9, కాకినాడ 18, కోనసీమ 7, కృష్ణా 15, మన్యం 5, పశ్చిమగోదావరిలో 3 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశముందని పేర్కొన్నారు. శనివారం విజయనగరం జిల్లా కనిమెరకలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత, మన్యం జిల్లా పాచిపెంటలో 44.9 డిగ్రీలు, ఏలూరు జిల్లా కామవరపు కోటలో 44.7 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కొండాపురంలో 44.5 డిగ్రీలు, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 44.3 డిగ్రీలు, కృష్ణా జిల్లా నందివాడ, ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో



44.1 డిగ్రీలు చొప్పున, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 44 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. 188 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 176 మండలాల్లో వడగాడ్పులు వీచాయని వివరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే కూలీలు, పశువులు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండరాదని అంబేద్కర్ పేర్కొన్నారు.



జాతీయ జల అవార్డుల్లో ఎపికి మూడో ర్యాంకు

- ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

లోపలి పేజీలో..

జిఎస్‌టి పరిధిలోకి ఆర్‌బికెలు

కేంద్రం ఒత్తిడితో రాష్ట్ర సర్కారు నిర్ణయం

ఇప్పటి వరకు ఎరువుల అమ్మకాలపై పన్నుల్లేవు

ఇకపై అదనపు ట్యాక్స్ భారం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)ను ఈ సంవత్సరం ఖరీఫ్ నుంచి జిఎస్‌టి పరిధిలోకి తీసుకొస్తున్నారు. ఆర్‌బికెలు ప్రారంభమై మూడేళ్ళు నిండగా ఇప్పటి వరకు వాటిలో నిర్వహిస్తున్న ఎరువుల వ్యాపారంపై ప్రభుత్వం ఎలాంటి పన్నులూ చెల్లించట్లేదు. కొద్దీగొప్ప చెల్లించినా ఒక క్రమపద్ధతి లేదు. మాన్యువల్‌గా చేస్తున్నారు. కాగా ఆర్‌బికెలలో ఎరువుల అమ్మకాలపై జిఎస్‌టి కట్టట్లేదని కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ ఏడాది నుంచి ఆర్‌బికెలను జిఎస్‌టి పరిధిలోకి ఎపి ప్రభుత్వం తీసుకొస్తోందని, అందుకోసం ప్రస్తుతం ఆర్‌బికెల మ్యాపింగ్ జరుగుతోందని సమాచారం. ఆర్‌బికెలకు ఎరువుల సరఫరా నిమిత్తం ఎపి మార్క్‌ఫెడ్‌ను ప్రభుత్వం నోడల్ ఏజెన్సీగా నియమించింది. మార్క్‌ఫెడ్ నుంచి ఆర్‌బికెలకు ఎరువులు సరఫరా చేస్తున్నందున, ఇదంతా ప్రభుత్వరంగ సంస్థల మధ్య లావాదేవీలని, లైసెన్స్‌లు, జిఎస్‌టి నెంబర్ అవసరం లేదని ప్రభుత్వం వాదిస్తూ వచ్చింది. ఆర్‌బికెలలో అమ్మకాల సమయంలో వినియోగదారులైన రైతులకు ఎలాంటి బిల్లులూ జారీ చేయట్లేదు. బిల్లులు జారీ చేసినట్లయితే అందులోనే జిఎస్‌టి కలిసి ఉంటుంది. రిటైలర్ పాయింట్ అయిన ఆర్‌బికెలలో జరిగే విక్రయాలపై జిఎస్‌టి తప్పనిసరిగా చెల్లించాలని



(ఫైల్)

కేంద్రం పేర్కొనడంతో మార్క్‌ఫెడ్‌కు ఒక జిఎస్‌టి నెంబరు, మార్క్‌ఫెడ్‌కు బ్రాంచిలుగా వ్యవహరిస్తున్న రాష్ట్రంలోని అన్ని ఆర్‌బికెలకూ కలిపి కామన్‌గా వేరే జిఎస్‌టి నెంబర్ అమలు చేస్తున్నారు. దీనివలన ఆర్‌బికెలలో విక్రయించే ఎరువులకు ప్రభుత్వం జిఎస్‌టి చెల్లించాలి. సర్కారుకు ఇది అదనపు భారమని చెబుతున్నారు. ప్రస్తుతం ఎరువుల సేల్స్‌పై కేంద్రం 5 శాతం జిఎస్‌టి అమలు చేస్తోంది.

డిబిటి ఎఫెక్ట్

కేంద్రం ఎరువుల విషయంలో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) విధానం తెచ్చింది. గతంలో ఎరువుల కంపెనీలకు ఏక మొత్తంలో సబ్సిడీ ఇచ్చేది. డిబిటిలో అయితే ఇ-పోస్ యంత్రాల్లో అమ్మకాలు నమోదు చేస్తారు. వాటి ప్రాతిపదికన కంపెనీలకు సబ్సిడీ ఇస్తున్నారు. ఆర్‌బికెలలో డిబిటి విధానం సరిగ్గా అమలు కావట్లేదని, తమకు సబ్సిడీ పడట్లేదని ఎరువుల కంపెనీలు ఆర్‌బికెలకు ఎరువుల సరఫరాను తగ్గించాయి. ఈ కారణంగానే కేంద్రం ఆర్‌బికెలపై దృష్టి సారించిందని సమాచారం.

పిఎసిఎస్‌లు కదుతున్నాయి

రాష్ట్ర వ్యాప్తంగా 10,778 ఆర్‌బికెలుండగా 10,661 ఆర్‌బికెలు ఎరువుల వ్యాపారం చేస్తున్నాయి. అలాగే ఎప్పటి నుంచో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్) ఎరువుల వ్యాపారం చేస్తున్నాయి. వాటికి లైసెన్స్‌లు, జిఎస్‌టి ఉన్నాయి. ఎపిలో 2 వేలకు పైన సొసైటీలుండగా ఆర్థికంగా పరిపుష్టి కలిగిన 925 సొసైటీలు ఎరువుల వ్యాపారం చేస్తున్నాయి.

గతేడాది పిఎసిఎస్‌లు 3.54 లక్షల టన్నుల ఎరువులు అమ్మాయి. ఆర్‌బికెలలో 3.87 లక్షల టన్నుల అమ్మకాలు జరిగాయి. 2023-24లో ఆర్‌బికెలలో 10.5 లక్షల టన్నులు, సొసైటీలలో 7.5 లక్షల టన్నుల ఎరువులు అమ్మాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇదిలా ఉండగా సొసైటీల పరిధిలోకి ఆర్‌బికెలను తీసుకొస్తూ ఈ మధ్య ప్రభుత్వం చట్టం చేసింది. దాంతో సొసైటీలతోపాటు ఆర్‌బికెలనూ జిఎస్‌టి పరిధిలోకి తేవాల్సి వచ్చిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

నిరుద్యోగంపై పోరుబాట

- త్వరలో దేశవ్యాప్తంగా జాతాలు
- డివైఎఫ్ఐ అధ్యక్షులు రహీం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులు ఎఎ రహీం డిమాండ్ చేశారు. పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా త్వరలో ఐదు జాతాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎన్నడూ లేనంతగా నరేంద్ర మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మోడీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. నిరుద్యోగులను మోసం చేయడంలో మోడీ బాటలోనే రాష్ట్రంలో సిఎం జగన్ కూడా ఉన్నారని విమర్శించారు. ప్రతియేటా జాబ్ కేలండరు విడుదల చేస్తానని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.35 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖల్లోని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్‌తో త్వరలో దేశవ్యాప్తంగా జాతాలను


ఎంపి రహీంకు వినతి పత్రం అందజేస్తున్న నిరుదోగ్యులు

ప్రారంభించాలని డివైఎఫ్ఐ నిర్ణయం తీసుకుందని తెలిపారు. దక్షిణ భారతదేశం నుంచి రెండు ప్రారంభమవుతాయని, ఇందులో ఒకటి హైదరాబాద్ నుంచి ఉంటుందని చెప్పారు. ఈ జాతాతోపాటు లాంగ్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. వీటిని జయప్రదం చేయాలని కోరారు. రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక విధానాన్ని నాశనం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందన్నారు. రాజ్యాంగ విలువలకు కేంద్రంగా ఉండాల్సిన పార్లమెంటును ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఒక మత కార్యక్రమంలా ప్రారంభించారని విమర్శించారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని రెజర్లు చేస్తున్న ఆందోళనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. బ్రిజ్ భూషణ్‌పై పెట్టిన కేసును సైతం వెనక్కు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వం వ్యవస్థలను మేనేజ్ చేసిందని విమర్శించారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసకు కారణం కేంద్ర ప్రభుత్వమే అని విమర్శించారు. సరైన సమయంలో స్పందించలేదన్నారు.

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల్లో మిగతా 2లో

అమర్నాథ్ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- బాపట్ల ఎస్‌పి

జులై 10న దేశ వ్యాప్తంగా బ్లాక్ డే

- రాష్ట్రంలో 10, 11తేదీల్లో ఆందోళనలు
- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

విచారణ చేసేది ఇలాగేనా?

- కట్టుకథలు సృష్టించారు
- ఢిల్లీ అల్లర్ల కేసుల్లో పోలీసుల తీరును తూర్పారపట్టిన న్యాయస్థానాలు

లోపలి పేజీలో..

రూ.88,000 కోట్లు గల్లంతు!

రూ.500 నోట్లపై పొంతన లేని లెక్కలు

హైదరాబాద్ : భారత ఆర్థిక వ్యవస్థ నుంచి ఏకంగా రూ.88,032 కోట్లు గల్లంతయ్యాయి. అవన్నీ ప్రింట్ చేసిన రూ.500 నోట్లు కావడం గమనార్హం. సామాజిక కార్యకర్త మనోరంజన్ రాయ్ సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా సేకరించిన గణాంకాలతో ఈ విషయం వెల్లడయ్యింది. ముద్రించిన నోట్లు ఆర్‌బిఐకి చేరకపోవడం విశేషం. దేశంలో బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రన్ (పి) లిమిటెడ్, నాసిక్‌లోని కరెన్సీ నోట్ ప్రెస్, మధ్యప్రదేశ్‌లోని దేవాస్‌లో ఉన్న బ్యాంక్ నోట్ ప్రెస్‌లలో కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నారు. 2016లో పాతనోట్లను రద్దు చేసి కొత్త రూ.500 నోట్లను ప్రవేశపెట్టిన సమయంలో దేశంలోని మూడు ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి 8,810.65 మిలియన్ల రూ.500 నోట్లను ముద్రించారు. అందులో కేవలం 7,260 మిలియన్ల నోట్లు మాత్రమే ఆర్‌బిఐకి చేరాయి. మిగతా 1,760.65 మిలియన్ల నోట్లకు సంబంధించిన సమాచారం ఆర్‌బిఐ వద్ద లేదు. వీటి విలువ రూ.88,032.50 కోట్లుగా ఉందని మనోరంజన్ తెలిపారు. ఆర్‌టిఐ సమాచారం ప్రకారం.. 2016-17 మధ్య కాలంలో 1,662 మిలియన్ల రూ.500ల నోట్లను ముద్రించినట్లు నాశిక్ మింట్ వెల్లడించింది. ఇదే సమయంలో బెంగళూరులోని ప్రెస్‌లో 5,195.65 మిలియన్లు, దేవస్‌లో 1,953 మిలియన్ల నోట్లను ముద్రించారు. మొత్తంగా 8,810.65 మిలియన్ల నోట్లను ముద్రించగా.. ఇందులో 7260 మిలియన్ల నోట్లే ఆర్‌బిఐకు చేరాయి. నోట్ల ముద్రణ, ఆర్‌బిఐకి చేరిన నోట్ల వ్యత్యాసంపై విచారణ చేపట్టాలని ఆర్‌టిఐ కార్యకర్త మనోరంజన్ సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లకు లేఖ రాశారు. గల్లంతయిన నోట్లపై మిస్టరీ వీడాల్సి ఉంది. దీనిపై ఆర్‌బిఐ, ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు ఎలాంటి వివరణ ఇస్తాయో వేచి చూడాలి.





ప్రొఫెసర్ హరగోపాల్‌పై 'ఉపా' కేసులు ఎత్తివేయండి

మీడియాతో మాట్లాడుతున్న హరగోపాల్

- డిజిపికి సిఎం కెసిఆర్ ఆదేశాలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

పౌర హక్కుల నేత, ప్రొఫెసర్ కె.హరగోపాల్‌పై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద పోలీసులు నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్ణయించారు. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని డిజిపి అంజనీకుమార్‌ను శనివారం ఆదేశించారు. గతేడాది ఆగస్టు 19న తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో దాదాపు 150 మందిపై ఉపా చట్టం కింద కేసులు నమోదయ్యాయి. ఈ పోలీసు స్టేషన్ పరిధిలోని దట్టమైన అడవిలో సాయుధ మావోయిస్టులు సమావేశమై రాష్ట్రంలో కొందరు రాజకీయ ప్రముఖులను హత్య చేయడానికి, ప్రభుత్వాస్తులను విధ్వంసం చేయడానికి కుట్ర పన్నారని పోలీసులు తాము నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించారు. పోలీసుల సోదాల్లో లభించిన డైరీలో మావోయిస్టుల అగ్రనేత పుల్లూరు ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, ప్రొఫెసర్ హరగోపాల్, పలువురు మావోయిస్టులు, ప్రజాసంఘాల నాయకులు ఆ సమావేశంలో పాల్గొన్నట్టు ఉందని పేర్కొన్నారు. కె.హరగోపాల్‌పై ఉపా చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం తాజాగా వెలుగులోకి రావడంతో పోలీసుల తీరును మేధావులు, విద్యావేత్తలు, మిగతా 2లో

ఉగాండా స్కూలుపై ఉగ్రవాదుల దాడి

- 38మంది విద్యార్థులతో సహా 41మంది మృతి

కంపాలా (ఉగాండా) : కాంగో సరిహద్దు పాండ్వేలోని ఉగాండా సెకండరీ పాఠశాలపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 38 మంది విద్యార్థులు సహా 41 మంది ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో ఎనిమిది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. మరో ఆరుగురిని కిడ్నాప్ చేశారు. ఉగాండా మిలటరీ, మేయర్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో తీవ్రవాద గ్రూపు అలైడ్ డెమొక్రటిక్ ఫోర్సెస్ దాడి చేసి ఈ ఘాతుకానికి పాల్పడింది. ఒక గార్డు, ఇద్దరు స్థానికులను స్కూలు బయట చంపేశారు. డార్మిటరీకి నిప్పంటించడంతో అందులో వున్న కొందరు విద్యార్థులు కాలిన గాయాలతో మరణించగా, మరికొందరిని కాల్చివేసి, కొడవళ్లతో నరికి చంపేశారు. ఆహార పదార్థాలు వుండే స్టోర్‌ను లూటీ చేశారు. అక్కడ దోచిన ఆహార పదార్థాలను మోసేందుకే ఆరుగురిని కిడ్నాప్ చేసినట్లు భావిస్తున్నట్లు సైనిక ప్రతినిధి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతి

మృతుల్లో భార్యాభర్తలు

ప్రజాశక్తి- ఆలమూరు (డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా), ఉరవకొండ (అనంతపురం జిల్లా)

రాష్ట్రంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. 11 మంది గాయపడ్డారు. మృతుల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన ఐదుగురు, అనంతపురం జిల్లాకు చెందిన భార్యాభర్తలు ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముద్దుర్తికి చెందిన తొమ్మిది మంది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మందపల్లిలోని శనీశ్వరాలయానికి టాటా వ్యాన్‌లో బయలుదేరారు. రాజమహేంద్రవరం దాటి రావులపాలెం వైపు వెళ్తుండగా అదే మార్గంలో విశాఖపట్నం నుంచి పాలకొల్లు వెళ్తున్న కారు వీరి వ్యాన్‌ను వెనుక నుండి ఢీకొంది. దీంతో, వ్యాన్ అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొంది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న పతివాడ కన్నయ్య లింగం (55), బోడి వెంకటరమణ (55), గంగిరెడ్ల శ్రీను (38) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బోడి వెంకినాయుడు (45) రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఐదుగురికి తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముప్పల శ్రీనివాసరావు, బోడి సత్యనారాయణ, పోసూరి నర్సింగరావు, కొమరి హేమంత్, తమ్మన శ్రీనివాసరావు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన కారు అదుపు తప్పి రోడ్డు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టాటా వ్యాన్

పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో, ఆ కారులో ప్రయాణిస్తున్న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వేగేశ్న సుబ్రహ్మణ్యంరాజు (45) అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పాలకొల్లు మండలానికి చెందిన జిత్తుముక్కల వెంకటరాజు, ఆరుమిల్లి రాజేశ్వరరావు, మేడపాటి వెంకట రామకష్టారెడ్డి ఉన్నారు.

అనంతపురం నగరంలోని మారుతీ నగర్‌కు చెందిన భార్యాభర్తలు నాగరాజు (33), స్వాతి (28) కుటుంబంతోసహా కణేకల్‌లో జరిగిన జాతరకు వెళ్లారు. అనంతరం అనంతపురానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. ఉరవకొండ మండలం పెన్నోబిలం వంతెన సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడిక్కడే మృతి చెందారు. వీరి ఇద్దరి కుమారులు హేమంత్, భానుప్రకాష్ గాయపడ్డారు.

తండ్రి ఆస్తిలో ఆడబిడ్డలకూ హక్కు

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

హిందూ వారసత్వ సవరణ చట్టం ప్రకారం ఆస్తిలో ఆడబిడ్డలకు కూడా హక్కు ఉంటుందని హైకోర్టు తీర్పు చెప్పింది. పుట్టుకతోనే ఆడ పిల్లలకు కూడా ఆస్తి హక్కు ఉందని చెప్పింది. సవరణ చట్టం 2005 సెప్టెంబరు 9 నుంచి అమల్లోకి వచ్చిందని, అప్పటికి తండ్రి బతికి ఉన్నారా, అప్పటికే చనిపోయారా అనే అంశంతో సంబంధం లేదంది. హిందూ అవిభాజ్య కుటుంబంలో కుమారులతో కుమార్తెలకు సమాన ఆస్తి హక్కులు ఉన్నాయని జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి తీర్పు చెప్పారు.

తమ తండ్రి తురగా రామ్మూర్తి ఆస్తిలో తనకు సోదరులు, సోదరీమణులు వాటా ఇవ్వడం లేదంటూ 1986లో ఆనందరావు తెనాలి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దావా వేశారు. తండ్రి ఆస్తిలో తమకు సమాన వాటా ఉందంటూ రామ్మూర్తి కుమార్తెలు సీతారావమ్మ మరో ఇద్దరు కూడా ఆ కేసులో అనుబంధ పిటిషన్లు వేశారు. వీళ్లకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిని సమీక్షించాలంటూ రామ్మూర్తి కొడుకులు, వాళ్ల వారసులు రివ్యూ పిటిషన్ వేస్తే వీరికి అనుకూలంగా 2010లో తీర్పు వచ్చింది. వారసత్వ సవరణ చట్టం ప్రకారం ఆస్తిలో కుమార్తెలకు వాటాలు రావని చెప్పిన తీర్పును ముగ్గురు కుమార్తెలు హైకోర్టులో సవాల్ చేశారు. తండ్రి వారసత్వ ఆస్తిలో కొడుకులు, కుమార్తెలకు సమాన వాటాలు ఉంటాయని హైకోర్టు తీర్పు చెప్పింది.

దళితులపై దాడి

- మెజిస్టీరియల్ విచారణకు కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం తొలగింపు సందర్భంగా అర్ధరాత్రి దళితులపై దాడి జరిగిందని, రక్షించాల్సిన పోలీసులే భక్షకులుగా మారి మహిళలు, చిన్న పిల్లలు అని చూడకుండా చీరలు లాగేసి కొట్టడం దుర్మార్గమని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. ఈ కులదురహంకార ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం మెజిస్టీరియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతోపాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. తిరుమలాయపాలెంలో ఘటన ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, పోలీసుల దాడిలో అనేక మంది గాయపడ్డారని, నలుగురు మహిళలు ఇప్పటికీ ఆస్పత్రిలోనే ఉన్నారని తెలిపారు. ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, జిల్లా కలెక్టరు, ఎస్‌పి బాధితులను పరామర్శించాలని, వారికి పోలీసుల నుంచి రక్షణ కల్పించాలని, చట్టాలు దళితులకు అండగా ఉన్నాయనే భరోసా కల్పించాలని అన్నారు.

అడుక్కుంటే సిఎం అవ్వరు

- పవన్ కల్యాణ్‌పై మంత్రి అప్పలరాజు ధ్వజం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి పదవి అడుక్కుంటే రాదని, ప్రజలు ఇస్తే వస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఎద్దేవా చేశారు. శ్రీకాకుళంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీకి వెళ్లకుండా తనను అడ్డుకోలేరని పవన్ అంటున్నారని, ముందు ఆయన ఎక్కడ నుంచి పోటీ చేస్తారో చెప్పాలన్నారు. వారాహి యాత్ర అసమర్థ యాత్ర అని వ్యాఖ్యానించారు. తనను సిఎం చేయండి అంటున్న పవన్, జనసేన ఎన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందో చెప్పాలన్నారు. 30 నియోజకవర్గాల్లో పోటీ చేస్తే సిఎం అవ్వలేరన్నారు.

ధనుకా గ్రూప్ స్టాల్‌ను సందర్శించిన వ్యవసాయ మంత్రి

హైదరాబాద్ : నగరంలో జరుగుతున్న హైదరాబాద్‌లో జరుగుతున్న జి20 వ్యవసాయ మంత్రివర్గ సమావేశంలో ధనుకా అగ్రిటెక్ లిమిటెడ్ స్టాల్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తోమర్ సందర్శించారని ఆ సంస్థ తెలిపింది. వ్యవసాయ రంగానికి తమ సంస్థ అందిస్తున్న సహకారాన్ని ప్రశంసించారని పేర్కొంది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కౌలాష్ చౌదరి కూడా పాల్గొన్నారు. గ్రూప్ ఛైర్మన్ ఆర్‌జి అగర్వాల్‌తో వ్యవసాయ రంగంలో వివిధ అవకాశాలు, వ్యవసాయ రసాయన పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి చర్చించారని పేర్కొన్నారు.

నిరుద్యోగంపై పోరుబాట

మొదటి పేజీ తరువాయి

పోస్టులను మిగులుగా చూపే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. దీనివల్ల 50 వేల మందికి పైగా అభ్యర్థులు నష్టపోతారని పేర్కొన్నారు. పశు సంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న 4,765 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వై రాము మాట్లాడుతూ.. దేవాదాయ శాఖలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రేడ్-3 ఇఒ పోస్టులను భర్తీ చేయాలని, గ్రూప్-2 పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖలో పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ అభ్యర్థులు ఎఎ రహీంకు వినతి ప్రతం అందించారు.

'ఉపాధి' కల్పనలో నిర్లక్ష్యం

- ఖరీఫ్ సమీపిస్తున్నా లక్ష్యంలో తీవ్ర వెనుకబాటు
- ఎస్‌సి, ఎస్‌టికి నామమాత్రంగా పనులు



గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం తురకపాలెంలో ఉపాధి పనుల్లో కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉపాధి కార్మికులకు పనుల కల్పనలో గుంటూరు జిల్లా వెనుకబడింది. జిల్లాలో రూ.120 కోట్ల మేరకు పనులు లక్ష్యం కాగా, ఇప్పటివరకు రూ.40 కోట్ల మేరకు మాత్రమే పనులు జరిగాయి. ఉపాధి హామీ పనులు ప్రారంభమై 75 రోజులు పూర్తయినా, కొన్ని గ్రామాల్లో కనీసం ఐదు శాతం పనులు కూడా జరగలేదు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మరికొన్ని గ్రామాల్లో టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల కొరత వేధిస్తోంది. దీంతో, పనుల గుర్తింపు మొదలుకొని కల్పన వరకూ వెనుకబాటు ఉంది. ఎస్‌సి, ఎస్‌టిలకు పనుల కల్పనలో అలసత్వం స్పష్టంగా కనబడుతోంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు కిందిస్థాయి అధికారులు పనిచేయడం లేదని చెప్పి చేతులు దులుపుకుంటున్నారు. గుంటూరు జిల్లాలోని 17 మండలాల్లో ఈ ఏడాది 30 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం. గడిచిన 75 రోజుల్లో కనీసం 14 లక్షల పనిదినాలు కూడా కల్పించలేదు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో, వ్యవసాయ పనులు దొరుకుతున్నాయనే పేరుతో అధికారులు ఉపాధి పనులను నిలిపివేసే అవకాశం ఉంది. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఈ ఏడాది ఉపాధి పనులు కనీసం 20 శాతం కూడా పూర్తి కాలేదు. వట్టిచెరకూరు, కొల్లిపర, తుళ్లూరు, గుంటూరు రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో 15 నుంచి 19 శాతం మాత్రమే పనులు జరిగాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు మందగమనంగా సాగాయి. జిల్లా మొత్తమ్మీద ఐదారు మండలాల్లోనే పనులు 60 శాతం వరకు జరిగాయి. గుంటూరుకు సమీపంలోని వట్టిచెరకూరు మండలం చమళ్లమూడిలో 51 మంది ఎస్‌టిలు ఉంటే వారిలో ఇద్దరికి, 216 మంది ఎస్‌సిలు ఉంటే వారిలో నలుగురికి, వింజనంపాడులో 222 జాబ్ కార్డులు ఉంటే ఇప్పటివరకు నలుగురికి మాత్రమే పనులు కల్పించారు. గుంటూరు రూరల్ మండలంలో గరిష్టంగా 19.9 శాతం మాత్రమే పనులు జరిగాయి. కొల్లిపర మండలంలోని పలు గ్రామాల్లో పనుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం కన్పిస్తోంది. ఈ మండలంలోని తుమూలూరులో 51 మంది ఎస్‌టిలు ఉండగా, వారిలో ముగ్గురికి మాత్రమే పనులు కల్పించారు. ఈ గ్రామంలో 750 జాబ్ కార్డులు ఉండగా, వంద మందికి కూడా పని కల్పించలేదు. ఒక్కో కుటుంబానికి ఒక్కో జాబ్ కార్డు ఉండగా, కుటుంబంలో ఒక్కరికి కూడా పని దక్కని పరిస్థితి చాలా గ్రామాల్లో ఉంది. ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించాలని జాబ్‌కార్డుదారులు కోరుతున్నారు.

20 లక్షల ఉద్యోగాలిస్తాం

- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ



గిరిజనులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి-నెల్లూరు, తిరుపతి ప్రతినిధి, అమరావతి బ్యూరో

తాము అధికారంలోకి వస్తే 20 లక్షల మంది యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర 130వ రోజుకు చేరుకుంది. వెంకటగిరి నియోజకవర్గంలోని కల్లూరు క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం యాత్ర ప్రారంభమైంది. అంతకుముందు గిరిజనులు, యువకులు, ముస్లిములతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అక్కడి నుంచి మాదన్నగారిపాళెం, చింతలపాళెం, వెంకట్రామరాజుపేట, ఉయ్యాలపల్లి, కొట్లూరుపల్లి, తెగచర్ల గ్రామాల మీదుగా యాత్ర కొనసాగింది. పలుచోట్ల జరిగిన సభల్లో లోకేష్ మాట్లాడుతూ... ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఎస్‌సి, ఎస్‌టిలను సిఎం మోసం చేశారని విమర్శించారు. 45 సంవత్సరాలు నిండిన మహిళకు పించను ఇస్తామని తాము అధికారంలోకి వస్తే 18సంవత్సరాలు నిండిన మహిళకు ప్రతినెలా రూ.1500లు ఇస్తామని, ఐదేళ్లలో రూ.90వేలు ఇస్తామని తెలిపారు. ' మేము వర్షాధారంపై ఆధారపడి పంటలు పండిస్తున్నామని, తీవ్ర అనావృష్టి పరిస్థితుల్లో వలసలు పోతున్నామని, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ పూర్తి చేసి నీరు ఇవ్వాలని వెంకటగిరి నియోజకవర్గం తెగచర్ల గ్రామస్తులు కోరారు. కెనాల్‌ను పూర్తి చేసి లిఫ్ట్ ద్వారా తమ పంచాయతీలోని చెరువులకు నీరందిస్తే తమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ.. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సోమశిల- స్వర్ణముఖి లింక్‌కెనాల్ పూర్తి చేసి, సమీప గ్రామాల ప్రజలకు నీరందిస్తామన్నారు. లోకేష్‌కు అడుగడుగున యువకులు, మహిళలు, వృద్ధులు వినతిపత్రాలు అందజేశారు. పాదయాత్రలో వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగా ప్రసాద్, ఆనం అనుచరులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిజిపి ఐపిఎస్‌లా ఆలోచించాలి

వైసిపి బుద్ధితో కాకుండా ఐపిఎస్‌లా ఆలోచించాలని డిజిపికి నారా లోకేష్ సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, క్రైమ్ రేటు పెరగలేదని డిజిపి సర్టిఫికెట్ ఇచ్చేసుకున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసిపి కార్యకర్త వెంకటేశ్వరరెడ్డి పదో తరగతి చదువుతున్న అమర్‌నాథ్‌ను అత్యంత దారుణంగా కొట్టి తగలబెట్టడం నేరం కాదా? అని నిలదీశారు.



బుల్‌డోజర్‌తో పేదల నివాసాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఢిల్లీలో ప్రియాంక క్యాంప్ కూల్చివేత

- బుల్‌డోజర్లతో నేలమట్టం
- రోడ్డున పడ్డ వందలాది పేదలు

న్యూఢిల్లీ : దక్షిణ ఢిల్లీ ప్రాంతంలోని వసంత విహార్ సమీపంలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ పేరిట ఉన్న క్యాంప్‌ను జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బుల్‌డోజర్లతో కూల్చివేసింది. దీంతో ఈ క్యాంప్‌లో నివాసం ఉంటున్న 97 కుటుంబాలు, వాటికి చెందిన 500 మంది ప్రజలు రోడ్డున పడ్డారు. క్యాంప్ ఉన్న స్థలం ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందినదని పేర్కొంటూ గత నెల 19న హౌసింగ్, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్థానికులకు నోటీసులు ఇచ్చింది. దానిని ఖాళీ చేయాలని ఆదేశించింది. ఈ నోటీసులకు అనుగుణంగా ఢిల్లీ పోలీసులు, జాతీయ విపత్తు నిర్వహణ, స్పందన కేంద్రం (ఎన్‌డిఎంఆర్‌సి), కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్) సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి.

తమ నివాసాలను కూల్చివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వద్ద ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీలు, జన్‌ధన్ యోజన పథకానికి సంబంధించిన జీరో బ్యాలెన్స్ అకౌంట్ నెంబర్లు వంటి అధికారిక పత్రాలు ఉన్నాయని వారు తెలిపారు. విద్యుత్ బిల్లులు కూడా తమ పేరిటే ఉన్నాయని చెప్పారు. కూల్చివేతలు ప్రారంభించి, ప్రజలను అదుపు చేసే క్రమంలో కార్మిక సంఘాలు, స్థానికులు పెద్ద ఎత్తున పోలీసులతో ఘర్షణకు దిగారు. ఘరేలు కామ్‌కాజీ మహిళా సంఘటన్ (జికెఎంఎస్) అధ్యక్షురాలు నేహా బోరా, ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (ఎఐసిసిటియు) నాయకుడు ఆకాష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ సామానులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడుతుంటే పలువురు స్థానికులు రోదించారు. చాలీచాలని ఆదాయంతో రెండు గదుల ఇల్లు నిర్మించుకున్నామని, ఇప్పుడు దానిని కూల్చేశారని, ఇక తమకు దిక్కెవరని సునీత అనే మహిళ వాపోయారు.

ఢిల్లీలో గత రెండేళ్లలో పేదలు నివసిస్తున్న అనేక కాలనీలను కూల్చివేయడంతో వేలాది మంది ప్రజలు గూడును కోల్పోయి నిరాశ్రయులయ్యారు. లాండ్ కాన్‌ఫ్లిక్ట్ వాచ్ అనే సంస్థ నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఇలాంటి కూల్చివేతల కారణంగా 26 వేల మంది రోడ్డున పడ్డారు. అధికార అమ్‌ఆద్మీ పార్టీ ఉదాశీనత కారణంగానే తమకు ఈ దుస్థితి దాపురించిందని జికెఎంఎస్‌కు చెందిన రేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రభుత్వం కూల్చివేతలకు వ్యతిరేకమంటూ ప్రగల్భాలు పలికిన మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఇప్పుడు ఏమీ చేయడం లేదని మండిపడ్డారు. కూల్చివేతలతో నిరాశ్రయులైన వారి కోసం ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన ఇళ్లు నివాసయోగ్యం కావని, అక్కడ మహిళలకు ఏ మాత్రం రక్షణ లేదని కార్మికురాలు బీనా తెలిపారు.

మ్యూజియం పేరు మార్పు తగదు

- పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరును మోడీ ప్రభుత్వం మార్చడం తగదని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం తొమ్మిదేళ్లకు పైగా జైలు జీవితం అనుభవించి, దేశానికి 16 ఏళ్లకు పైగా ప్రధానిగా సేవలందించిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరును మార్చడమంటే స్వాతంత్ర్య సమరయోధులను బిజెపి ప్రభుత్వం అవమానించడమేనని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్ర లేకుండా బ్రిటీష్ వారికి మద్దతుగా నిలిచిన ఆర్ఎస్ఎస్ శక్తులు దేశ చరిత్రను కుట్ర పద్ధతుల్లోకి మార్చాలని తెరవెనుక నుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని గౌతమ్ విమర్శించారు. బిజెపి, మోడీ కుట్రపూరిత చర్యలను దేశంలోని మేధావులు, చరిత్రకారులు, ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

ఎసిబికి చిక్కిన తెలంగాణ యూనివర్సిటీ విసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తొలిసారిగా ఒక యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ (విసి) లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడటం కలకలం రేపింది. రూ. 50 వేలను ఒక కాలేజీ చైర్మన్ నుంచి లంచంగా తీసుకుంటుండగా తార్నాకలోని ఆయన నివాసంలోనే విసి రవీందర్ గుప్తాను ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిజి డాక్టర్ రవి గుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గల శ్రీ సాయి డిగ్రీ కాలేజీకి ఎగ్జామినేషన్ సెంటర్‌ను కేటాయించడానికి గానూ రూ. 50 వేలను సదరు కాలేజీ చైర్మన్ శంకర్ నుంచి విసి డిమాండ్ చేశారు. ఆ డబ్బులను హైదరాబాద్ తార్నాకలోని కిమ్మిటీ కాలనీలో గల తన నివాసంలో శంకర్ నుంచి తీసుకొని తన బెడ్రూమ్‌లోని అల్మారాలో పెడుతుండగా.. అప్పటికే కాపుగాసిన ఎసిబి అధికారులు రవీందర్‌గుప్తాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రవీందర్‌గుప్తాను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడిని హైదరాబాద్‌లోని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. దానితో నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, ఈ దాడికి నాయకత్వం వహించిన ఎసిబి అదనపు ఎస్‌పి శ్రీనివాస్ తన టీమ్‌తో కలిసి విసి నివాసంలో తదుపరి దర్యాప్తులో భాగంగా సోదాలను నిర్వహించారు. 2021లో తెలంగాణ యూనివర్సిటీ విసిగా నియమితులైనప్పటి నుంచి పలు వివాదాల్లో రవీందర్‌గుప్తా చిక్కుకున్నారు. ముఖ్యంగా, యూనివర్సిటీ పరిపాలనకు సంబంధించి పలు అక్రమాలకు పాల్పడ్డారనీ, కొందరిని యూనివర్సిటీ ఉద్యోగాల్లో నియమించి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారనీ, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌లను తరచుగా మారుస్తూ ఇష్టారాజ్యం చేశారని ఇప్పటికే విద్యార్థి సంఘాలు ఆయనపై పలు ఆరోపణలు చేశాయి.

రూ.440 పెరిగిన బంగారం

న్యూఢిల్లీ : వారాంతం రోజున బంగారం ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.440 పెరిగి రూ.60,110గా పలికింది. గుడ్‌రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. 22 క్యారెట్ల పసిడిపై కూడా రూ.400 పెరిగి రూ.55,100 వద్ద నమోదయ్యింది. చెన్నయ్, హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.78,500గా ఉంది.

సిపిఐ(ఎం) ఎంపీపై తప్పుడు ప్రచారం

- బిజెపి తమిళనాడు కార్యదర్శికి రిమాండ్
- న్యాయమూర్తి ఇంటి ముందు బిజెపి వీరంగం

చెన్నై: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఎంపీ వెంకటేశన్‌పై పై తప్పుడు ప్రచారం చేసి, ఆయన ప్రతిష్టకు భంగం కలిగించారన్న కేసులో బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఎస్ సూర్యను కోర్టు 15 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. మదురైలోని న్యాయమూర్తి ఇంటి ముందు కాషాయ మూకలు ఉద్రిక్తత సృష్టించాయి. మదురై సిపిఐ(ఎం) కౌన్సిలర్ విశ్వనాథన్ డ్రైనేజీని శుభ్రం చేయడానికి పారిశుధ్య కార్మికుడిని బలవంతం చేశాడని, అలర్జీ ప్రతిచర్య కారణంగా కార్మికుడు మరణించాడని సూర్య ట్వీట్ చేశారు. ఎంపి మౌనం వహించడాన్ని సూర్య విమర్శిస్తూ వేర్పాటువాద, కపట రాజకీయాలు ఆ మురుగు కన్నా అధ్వానంగా ఉన్నాయని ట్వీట్ చేశారు. మదురై ఎంపి ప్రతిష్టను కించపరిచేలా సూర్య చేసిన ట్వీట్‌పై సిపిఐ(ఎం) మదురై అర్బన్ కార్యదర్శిఎం గణేశన్, పార్టీ కార్యకర్తలు పోలీస్ కమిషనర్ నరేంద్ర నాయకర్‌కు ఫిర్యాదు చేశారు. మదురై కార్పొరేషన్‌లోని పెన్నడం టౌన్ పంచాయతీలో వామపక్షాలకు విశ్వనాథన్ అనే కౌన్సిలరే లేరని సిపిఐ(ఎం) పేర్కొంది. జరగని ఘటనపై సూర్య కావాలనే ఈ విధమైన తప్పుడు ప్రచారం చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని గణేశన్ విమర్శించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రాజీవ్ చంద్రశేఖర్ కూడా ఇదే విధమైన తప్పుడు ప్రచారం చేయడాన్ని వెంకటేశన్ ఖండించారు.



భౌతికకాయంపై సిపిఎం జెండాను కప్పి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

శ్రీకాకుళ గిరిజన ఉద్యమ నేత మండంగి కన్నుమూత

ప్రజాశక్తి - కురుపాం (పార్వతీపురం మన్యం జిల్లా)

శ్రీకాకుళ గిరిజన ఉద్యమ నేత, సిపిఎం సీనియర్ నాయకులు మండంగి బొంకు (105) శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామమైన కురుపాం మండలం వబ్బంగి పంచాయతీ తోలుంగూడలో కన్నుమూశారు. ఆయన శ్రీకాకుళం గిరిజన ఉద్యమంలో కోరన్న, మంగన్నతో సహచరుడు. వారి స్ఫూర్తితో శ్రీకాకుళ రైతాంగ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసం, చౌదరి తేజేశ్వరరావు నాయకత్వంలో పల్లేరుక రఘురాములు, కొండగొర్రి లచ్చన్న, ఆరికగుంపు స్వామి, సుంచులు, సోములు, రసూల్‌తో కలిసి ఉద్యమాన్ని నిర్మించారు. గిరిజన ప్రాంతంలో భూస్వాములు, ప్రభుత్వ అధికారుల దౌర్జన్యాలకు, వెట్టిచాకిరికీ, భూమికోసం భుక్తి కోసం జరిగిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంలో మండంగి కీలకమైన పాత్ర పోషించారు. మూడేళ్ల జైలు శిక్ష అనుభవించిన అనంతరం గిరిజన సంఘం, సిపిఎంలో చేరి ఈ ప్రాంతంలోని గిరిజన సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆయనకు ఇద్దరు భార్యల్లో మొదటి భార్య మృతి చెందగా, రెండో భార్య గౌరీ, కుమారులు కడాయి, మాసయ్య, అడ్డమేశ్వరరావు ఉన్నారు. అడ్డమేశ్వరరావు ఒబ్బంగి ఎంపిటిసి సభ్యునిగా రెండు పర్యాయాలు గెలిచారు, కుమార్తెలు కొంజమ్మ, సుశీలమ్మ, మాసి, కుమారి ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలక అవినాష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు, గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.రమణ ఆయన భౌతికకాయంపై సిపిఎం జెండాను ఉంచి నివాళ్లు అర్పించారు.

ఎంపి మోపిదేవికి నిరసన సెగ

ప్రజాశక్తి-చెరుకుపల్లి (బాపట్ల జిల్లా)

పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావుకు వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసన తెలిపారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎంపి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. తన వ్యక్తిగత నిధుల నుండి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేసేందుకు ప్రయత్నించగా అమర్నాథ్ బంధువులు నిరాకరించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపి కాన్వాయ్‌కు అడ్డంగా వెళ్లారు.

'ఆజాన్' గీతాలాపనే నేరం

- ముంబయిలో పాఠశాల ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

ముంబయి : ముంబయిలోని కండివాలీ ప్రాంతంలో ఉన్న కపోల్ విద్యానిధి ఇంటర్నేషనల్ స్కూలులో ఉదయం వేళ ప్రార్థనల సమయంలో ముస్లిం గీతం 'ఆజాన్' ఆలపించాలని చెప్పిన ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆజాన్ ఆలపించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల వెలుపల శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో బిజెపి, శివసేన కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. దీనికి బిజెపి ఎమ్మెల్యే యోగేష్ సాగర్ నేతృత్వం వహించారు. వివిధ మతాల ప్రార్థనా గీతాలను గురించి విద్యార్థులకు అవగాహన కలిగించేందుకే ఆజాన్‌ను ఆలపించామని పాఠశాల ప్రిన్సిపాల్ రష్మీ హెగ్డే వివరణ ఇచ్చారు. తమ ప్రయత్నాన్ని కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఆమె తెలిపారు. ఆజాన్ ఆలాపన ద్వారా మత విశ్వాసాలను గాయపరిచారంటూ స్థానిక శివసేన నాయకుడు సంజయ్ సావంత్ ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ జరుపుతున్నామని పోలీస్ డిప్యూటీ కమిషనర్ అజయ్ కుమార్ బన్సల్ చెప్పారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలకు కార్యాచరణ ప్రణాళిక

- సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్టోబరు 2న మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా 'ఆడుదాం ఆంధ్రా' పేరిట నిర్వహించనున్న క్రీడా సంబరాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు 2023-2028 క్రీడా పాలసీపై శనివారం విజయవాడలోని సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. ముఖ్యంగా క్రీడాశాఖతోపాటు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సిఎస్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు గానూ గ్రామ, మండల స్థాయిలో అనువైన క్రీడా ప్రాంగణాలు, మైదానాలను గుర్తించి వాటిని వివిధ క్రీడల నిర్వహణకు వీలుగా తీర్చిదిద్దాలని ఆదేశం చారు. అంతేకాకుండా ఈ క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు వీలుగా గ్రామ స్థాయి నుంచి ప్రజలు ముఖ్యంగా యువత పెద్దఎత్తున భాగస్వామ్యులు అయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి క్రీడలతోపాటు ఇతర సంప్రదాయ క్రీడలను కూడా నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను జవహర్‌రెడ్డి ఆదేశించారు. 2023-2028 రాష్ట్ర క్రీడా విధానం గురించి కూడా అధికారులతో సిఎస్ సమీక్షించారు. వివిధ రకాల క్రీడాకారులను ప్రోత్సహించేలా నూతన క్రీడా పాలసీ ఉండేలా చూడాలని సిఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యదర్శి వాణీ మోహన్, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, సిఎం కార్యదర్శి ఆర్ ముత్యాలరాజు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విసి అండ్ ఎమ్‌డి కె హర్షవర్ధన్ పాల్గొన్నారు. వీడియో లింక్ ద్వారా క్రికెటర్ అంబటి రాయుడు, కెఎస్ భరత్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్‌పై 'ఉపా' కేసులు ఎత్తివేయండి

మొదటి పేజీ తరువాయి

ప్రజాసంఘాలు, విపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. హరగోపాల్‌పై కేసులు వెంటనే ఎత్తివేయాలని వామపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ప్రజా వ్యతిరేకత వ్యక్తమవడంతో అప్రమత్తమైన సిఎం కెసిఆర్... హరగోపాల్‌పై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిజిపిని ఆదేశించారు.

అందరిపై కేసులు ఎత్తేయాలి : ప్రొఫెసర్ జి హరగోపాల్ డిమాండ్

'నా ఒక్కడిపై కేసులు ఎత్తేయడం కాదు. 'ఉపా' చట్టం కింద కేసులు నమోదైన 152 మందిపైనా కేసులు ఎత్తేయాలి. పోలీసులు పెట్టిన కేసుల్లో బలం లేదని దీనితో తేలిపోయింది. 'ఉపా' చట్టాన్ని రద్దు చేస్తామని అన్ని రాజకీయపార్టీలూ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలి. ఆ మేరకు ప్రజలను చైతన్యవంతం చేస్తాం. సాధారణ ఎన్నికల్లో ప్రజలు అడిగే ప్రశ్నలకు అధికార పార్టీ నేతలు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. ఆ మేరకు కార్యాచరణ రూపొందిస్తాం' అని నిర్బంధ వ్యతిరేక వేదిక తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. శనివారం ఆయన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాలులో విలేకరులతో మాట్లాడారు. ఆయనతోపాటు తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, అరుణోదయ విమలక్క, పిఒడబ్ల్యు సంధ్య, ప్రొఫెసర్ పద్మజా షా, వేదిక కో కన్వీనర్లు ఎం.రాఘవాచారి, కె.రవిచందర్ సహా 29 ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. తాడ్వాయి పోలీసులు పెట్టిన 'ఉపా' కేసులతో పాటు గతంలో ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న కార్యకర్తలపై పెట్టిన కేసులన్నీ తక్షణం ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తనపై 'ఉపా' చట్టం కింద కేసు నమోదు కాగానే భిన్న వర్గాలకూ చెందిన అధికారులు, మేధావులు, కవులు, కళాకారులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజలు వేగంగా స్పందించారని, ఇదే తరహా చొరవ ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించేలా ఉండాలని ఆకాంక్షించారు. తాము పోరాడి సాధించుకున్న తెలంగాణ ఇది కాదని స్పష్టం చేశారు. గడిచిన తొమ్మిదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపా చట్టాన్ని విచ్చలవిడిగా వాడుతూ ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ఉపయోగించిదని, రాష్ట్రంలో కూడా ఇందుకు భిన్నమైన పాలన ఏమీ లేదని విమర్శించారు. దీనికి ముందు సదస్సు జరిగింది.

సిబిఐ విచారణకు హాజరైన అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు, కడప ఎంపి వైఎస్‌.అవినాష్‌రెడ్డి శనివారం కోఠిలోని సిబిఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఆయనను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సిబిఐ అధికారులు ప్రశ్నించారు. వివేకా హత్య జరిగిన రోజున తెల్లవారుజామున ఫోన్‌ సంభాషణపైనే సిబిఐ ఆరా తీసినట్లు తెలిసింది. సిబిఐ సేకరించిన టెక్నికల్‌ డేటా ఆయన ముందుంచి ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విషయంలో చాలా ప్రశ్నలకు అవినాష్‌ రెడ్డి తెలియదనే సమాధానం చెప్పినట్లు తెలిసింది. వివేకా హత్యకు పాల్పడిన నిందితులకు నగదు ఎక్కడ నుంచి సమకూర్చారని సిబిఐ అధికారులు ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30. 50 శాతం రాయితీ

- ఆప్కో ఎమ్‌డి ఎంఎం నాయక్‌

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆషాడ మాసం సందర్భంగా ఈ నెల 19 నుంచి ఆప్కో వస్త్ర విక్రయశాలల్లో అన్ని రకాల చేనేత వస్త్రాలపై ప్రత్యేక రాయితీ అందిస్తున్నట్లు సంస్థ ఎమ్‌డి ఎంఎం నాయక్‌ తెలిపారు. చేనేత వస్త్రాలన్నిటిపైనా 30 శాతం రాయితీ, ఎంపిక చేయబడిన చేనేత వస్త్రాలపై 50 శాతం రాయితీ అందిస్తున్నామన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని ప్రత్యేక రకాలపై 66 శాతం డిస్కౌంట్‌ సైతం అందుబాటులో ఉందని వివరించారు. వినియోగదారులందరూ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన చేనేత వస్త్రాలను ఆప్కో షోరూమ్‌ల నుంచి విరివిగా కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని చేనేత కళాకారులను ప్రోత్సహించి మంచి ఉపాధి అవకాశాలు కల్పించడంలో తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నైపుణ్యం గల చేనేత కార్మికులు, చేతితో మగ్గంపై నేసిన కాటన్, పట్టు వస్త్రాలు, దేశ, విదేశాల్లో మంచి ప్రాముఖ్యం పొందాయన్నారు. బందరుపేట చీరలు, ఉప్పాడ జందాని సిల్క్ చీరలు, చీరాల ఫ్యాన్సీ చీరలు, వెంకటగిరి జరీ సిల్క్ చీరలు, మదనపల్లి, మాధవరం, మంగళగిరి పంజాబీ డ్రెస్ మెటీరియల్, పెద్దాపురం పట్టుదోవతులు, పొందూరు దోవతులు, పొందూరు, చెరుకుపల్లి షర్టింగ్, బెడ్‌షీట్లు, లుంగీలు, టవల్స్, గృహోపయోగ వస్త్రాలపై రాయితీ ఉందన్నారు. నూతన వెరైటీలపై కూడా ఈ ప్రత్యేక రాయితీ అందుబాటులో ఉందని ఎంఎం నాయక్ పేర్కొన్నారు.

అమర్నాథ్‌ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్‌

- బాపట్ల ఎస్‌పి



మృతదేహంతో ధర్నా నిర్వహిస్తున్న బంధువులు, ప్రజాసంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెరుకుపల్లి,రేపల్లె

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్‌ హత్య కేసులో నలుగురు నిందితులపై పోక్సో చట్టంతో పాటు సెక్షన్‌ 354 (డి), 341, 506, 323, 302, ఆర్/డబ్ల్యు 34 ఐపిసి చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు బాపట్ల ఎస్‌పి వకుల్‌జిందాల్‌ తెలిపారు. చెరుకుపల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వెల్లడించారు. అమర్నాథ్‌ సోదరిని ప్రధాన నిందితుడు వెంకటేశ్వర్‌రెడ్డి గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఆమె వెంబడి తిరగడం, వేధిస్తుండటాన్ని గమనించిన అమర్నాథ్‌ తన సోదరిని వేధించవద్దని, వెంకటేశ్వర్‌రెడ్డిని పలుమార్లు హెచ్చరించారు. వెంకటేశ్వర్‌రెడ్డి తల్లిదండ్రులకు కూడా ఈ విషయం చెప్పాడు. గ్రామంలో తనపైన దుష్ప్రచారం చేస్తున్నాడని.. అమర్నాథ్‌ను అంతమొందించాలని నిందితుడు నిర్ణయించుకున్నాడు. తన ముగ్గురి స్నేహితులతో పథకం రచించాడు. ట్యూషన్‌కి వెళ్తున్న అమర్నాథ్‌ను వెంబడించి సమీప పొలాల్లోకి తీసుకెళ్లి, పెట్రోల్‌ పోసి సజీవ దహనం చేసేందుకు ప్రయత్నించారు. బాధితుడు కేకలు విని పరిగెత్తుకుంటూ వచ్చిన గ్రామ వలంటీర్‌ డి.రామమూర్తిరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని అమర్నాథ్‌ తల్లి, బంధువులకు సమాచారం ఇచ్చారు. గుంటూరులో చికిత్స పొందుతూ బాధితుడు మృతి చెందాడు. కేసులో ప్రధాన నిందితుడితో పాటు గోపిరెడ్డి, వీరబాబులను అరెస్ట్‌ చేశామని, మరొక నిందితుడు తమ్ముని సాంబిరెడ్డిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని, కేసు దర్యాప్తు అధికారిగా వేమూరు సిఐను నియమించినట్లు ఎస్‌పి తెలిపారు.

మృతదేహంతో ధర్నా

నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని, ప్రభుత్వ ఉద్యోగం కేటాయించాలని డిమాండ్‌ చేస్తూ రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్, బిసి సంఘ నాయకులు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో చెరుకుపల్లి ఐలాండ్‌ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి చెరుకుపల్లి తీసుకురాగా.. మృతదేహంతో బంధువులు, నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం నుండి సహాయం అందేందుకు కృషి చేస్తానని రేపల్లె ఆర్‌డిఒ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

రూ.10 లక్షల ఆర్థిక సాయం

అమర్నాథ్‌ కుటుంబానికి రూ.పది లక్షల ఆర్థిక సాయం, మృతుని సోదరికి అంగన్‌వాడీ ఉద్యోగం, ఇంటిస్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి సాయం అందిస్తామని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ హామీ ఇచ్చారు. హత్య విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారని, ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా సాయం అందించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు.

సహకార రంగంలో అధికార పార్టీ దోపిడీ

టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తన దోపిడీకి అడ్డాగా రాష్ట్ర సహకార రంగాన్ని మార్చుకుందని మాజీ మంత్రి, టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్‌ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి నుంచి కిందిస్థాయి వైసిపి నేత వరకు ఈ రంగంలో రూ.5 వేలకోట్లు కాజేశారని ఆరోపించారు. ఏలూరు జిల్లా టి నరసాపురం, చింతలపూడి, కామవరపు కోట, రంగాపురం, సరిపల్లితో పాటు, పలు సొసైటీల్లో రూ.400 కోట్ల రుణం తీసుకున్నారని తెలిపారు. కాకినాడ జయలక్ష్మి సహకార బ్యాంకుల్లో రూ.560 కోట్లు కాజేశారని, ఇలా అనేక చోట్ల జరిగాయని పేర్కొన్నారు. రైతులు ఎన్నుకోవాల్సిన కమిటీలు, సభ్యులను ప్రభుత్వం ఎంపిక చేసి సొమ్మును అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా దోచేస్తున్నారని విమర్శించారు. నాబార్డు, కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సిడిసిలు రైతుల కోసం ఇచ్చే సొమ్ము మొత్తం పక్కదారి పడుతోందని ఆరోపించారు. ఇంత దోపిడీ జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని తెలిపారు. ఈ అవినీతిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌ షాకు, ఇడి, నాబార్డు ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకుంటే రైతులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సహకార సంఘాలకు వచ్చే వేల కోట్ల లావాదేవీలపై ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. సొంత ఎంపి కుటుంబాన్ని కాపాడలేని ముఖ్యమంత్రి ఈ రాష్ట్రానికి అవసరమా? అని ప్రశ్నించారు.

ఎన్‌ఎస్‌జి ఆఫీసర్‌పై మనీలాండరింగ్‌ కేసు

- రూ.45 కోట్ల ఆస్తులకు ఇడి అటాచ్‌

న్యూఢిల్లీ : టెర్రరిజాన్ని ఎదుర్కోవడంలో, వివిఐపిలకు భద్రత కల్పించే నేషనల్‌ సెక్యూరిటీ గార్డ్‌ (ఎన్‌ఎస్‌జి) అధికారి, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన రూ.45 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఇడి) అధికారులు అటాచ్‌ చేశారు. ఎన్‌ఎస్‌జి అధికారి ప్రవీణ్‌ యాదవ్‌ గూర్‌గావ్‌లోని మనేసర్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని 'బ్లాక్‌ క్యాట్స్‌' కమాండో ఫోర్స్‌ వద్ద సివిల్‌ పనులను చేపట్టేందుకు జారీ చేసిన టెండర్‌ పత్రాలను ఫోర్జరీ చేశారన్న ఆరోపణలపై ఇడి విచారణ చేపట్టింది. ప్రవీణ్‌, అతని కుటుంబ సభ్యులపై మనీలాండరింగ్‌ నిరోధక చట్టం కింద మొత్తం రూ.45.20 కోట్ల విలువైన 52 చర, స్థిరాస్తులను అటాచ్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇడి వెల్లడించింది. బార్డర్‌ సెక్యూరిటీ ఫోర్స్‌ (బిఎస్‌ఎఫ్‌) నుంచి డిప్యూటేషన్‌పై ఆయన ఎన్‌ఎస్‌జిలో టీమ్‌ కమాండర్‌ (డిప్యూటీ కమాండెంట్‌ ర్యాంక్‌కు సమానం)గా నియమించబడ్డారు. ఈ కేసులో మొత్తం ఐదుగురుపై ఇడి అధికారులు ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. ప్రవీన్‌ యాదవ్‌ మనేసర్‌లోని యాక్సిస్‌ బ్యాంక్‌ ఇఎమ్‌డి (ఎర్నెస్ట్‌ మనీ డిపాజిట్‌) పేరుతో నకిలీ బ్యాంక్‌ ఖాతాను తెరిచినట్లు దర్యాప్తులో తేలిందని ఇడి తెలిపింది.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి - మడకశిర రూరల్‌ : నీటి తొట్టెలో పడి ఏడాదిన్నర వయసున్న చిన్నారి మృతి చెందిన సంఘటన సత్యసాయి జిల్లా మడకశిర మండల పరిధిలోని వైబి హళ్లి గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మున్నా, దేబిబార్కిమినా దంపతులు కోళ్లఫారంలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఏడాదిన్నర చిన్నారి మధుమిత్‌ ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటి తొట్టెలో పడి మరణించింది.

ప్రజాశక్తి - కడప అర్బన్‌

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల కోర్కెల దినోత్సవం పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 10న బ్లాక్‌ డే, రాష్ట్రంలో 10, 11వ తేదీల్లో అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. శనివారం కడప జడ్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఐసిడిఎస్‌ పరిరక్షణ కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు, నవరత్నాలు వర్తింప

జులై 10న దేశ వ్యాప్తంగా బ్లాక్‌ డే

- రాష్ట్రంలో 10, 11తేదీల్లో ఆందోళనలు : సుబ్బరావమ్మ

చేయాలని డిమాండ్‌ చేశారు. గర్భిణిలకు, బాలింతలకు, పేదలకు 48 ఏళ్లుగా కార్యకర్తలు, ఆయాలు సేవలు చేస్తున్నారని, నేటికి ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. గ్రాడ్యూటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సెక్టార్‌, ప్రాజెక్టు సమావేశాలకు వెళితే ఇవ్వాల్సిన టిఎ, డిఎ బిల్లులు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అంగన్‌వాడీలకు మెడికల్‌ సెలవులు ఇవ్వడం లేదని, చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ, కడప జిల్లాలలో రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు లక్ష్మీదేవి, సుప్రజ, రమాదేవి, రాజేశ్వరి, నిర్మల, రేఖ పాల్గొన్నారు.

జవాబుదారీతనానికి పెద్దపీట

జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జనసేన అధికారంలోకి వస్తే జవాబుదారీతనానికి పెద్ద పీట వేస్తామని, స్వచ్ఛత, బాధ్యత, పారదర్శకతతో వ్యవహరిస్తామని జనసేన అధినేత పవన్‌ కల్యాణ్‌ అన్నారు. వారాహి యాత్రలో భాగంగా శనివారం ఆయన ఒక ప్రయివేటు హోటల్లో కాకినాడ నగర ప్రముఖులు, మేధావులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్‌ మాట్లాడుతూ.. కాకినాడలో పోర్టు ఉన్నప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. పాలకుల తీరు దీనికి ఒక కారణం అయితే, అవినీతిమయమైన నాయకులను చట్టసభలకు పంపడం కూడా మరో కారణమని పేర్కొన్నారు. జనసేన పాలనలో స్వచ్ఛత, బాధ్యత, పారదర్శకత, సుపరిపాలన అనే అంశాలనే ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు వెళ్తామని తెలిపారు. ప్రజా పద్దులోని ప్రతి రూపాయికీ లెక్క చూపించే బాధ్యతను తీసుకుంటామని, సహజ వనరుల దోపిడీని పూర్తిగా అరికట్టేలా చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా అది ఏ వర్గాలను ప్రభావితం చేస్తుందో అందరి నిర్ణయాలు విన్న తర్వాతే ముందుకు వెళ్లాలనే దానిపై జనసేన కట్టుబడి ఉందని వివరించారు. అన్ని ప్రాంతాల్లో ఉన్న ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, మేధావులతో పూర్తిస్థాయిలో చర్చిస్తున్నామని తెలిపారు. అనంతరం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను పవన్‌ కల్యాణ్‌ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌ నాదెండ్ల మనోహర్‌, జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేశ్‌, పిఎపి సభ్యులు ముత్తా శశిధర్‌ తదితరులు పాల్గొన్నారు.




జనవాణి కార్యక్రమంలో బాధితులతో మాట్లాడుతున్న పవన్‌

పెరుగులంక భూముల కోసం న్యాయ పోరాటం

- పౌర హక్కుల సంఘం నేతలు

ప్రజాశక్తి - యలమంచిలి (పశ్చిమగోదావరి)

పశ్చిమగోదావరి జిల్లా చించినాడ పంచాయతీ పరిధిలోని పెరుగులంక దళితుల భూముల్లో అధికార యంత్రాంగం చేపట్టిన అక్రమ మట్టి తవ్వకాలను తక్షణం ఆపాలని, లేకుంటే సంబంధిత అధికారులపై న్యాయపరమైన పోరాటం చేస్తామని సుప్రీంకోర్టు న్యాయవాది, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి సురేష్‌ కుమార్‌, హైకోర్టు న్యాయవాది, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు హెచ్చరించారు. పౌరహక్కుల నేతలు శనివారం ఆయా భూముల్లో పర్యటించి, అక్రమ మట్టి తవ్వకాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గోదావరి చెంతన మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వడమే నిబంధనలకు విరుద్ధమని, కాంట్రాక్టర్‌ కేవలం 65 సెంట్ల భూమిలో మట్టి తవ్వకానికి అనుమతులు తీసుకున్నారని, అది కూడా 20 రోజులకు మాత్రమేనని తెలిపారు. రెండు నెలలుగా సుమారు పది ఎకరాల్లో మట్టిని బయటకు తరలించి ఇటుక బట్టీలకు, ప్రయివేటు వ్యక్తులకు అమ్ము కుంటున్నారని, ఇంత జరుగుతున్నా జిల్లా అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అడ్డుకున్న పేదలపై లాఠీఛార్జి చేసి కేసులు పెట్టారంటే అధికార యంత్రాంగం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుం దన్నారు. సహజంగా ఉండాల్సిన నది మార్గాన్ని సైతం మళ్లించే విధంగా మట్టి తవ్వకాలకు ఎవరైతే అనుమతులిచ్చారో వారిపై సర్వీసు రూల్‌ ప్రకారం ఫిర్యాదు చేసి అవసరమైతే జాతీయ పొల్యూషన్‌ శాఖకు, జాతీయ పౌర హక్కుల సంఘం కమిటీకి వివరించి అధికారులపై చర్యలు తీసుకునేలా ముందుకెళ్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసుల దాడిలో గాయపడిన దళితులను వారు పరామర్శించారు. వారి వెంట కెవిపిఎస్‌ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సీనియర్‌ న్యాయవాది పగిడిపల్లి రాము, ఐలు జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, న్యాయవాదులు పూరిళ్ల శ్రీనివాస్‌, నెక్కంటి క్రాంతి కుమార్‌, దళిత సంఘం నేతలు ఉన్నారు.



పెరుగు లంక భూములను పరిశీలిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

సంపాదకీయం

వాన!

'చూపుల కన్నా ఎదురుచూపులే తీయనా' అంటాడో కవి. ప్రాచీన సాహిత్యంలో ఎదురుచూపునకు ప్రతీక చాతక పక్షులు. వాన చినుకులను మాత్రమే తాగే చాతక పక్షులు...వాన కోసం, ఆకాశం నిండా ముసురుకొనే నల్లని మబ్బుల కోసం ఎదురుచూస్తుంటాయి. వెన్నెలను మాత్రమే భుజించే చాతకాలు పండువెన్నెల కోసం నిరీక్షిస్తుంటాయి. ప్రేయసీ ప్రియులు ఒకరికోసం ఒకరు, ఒకరి మాటకోసం మరొకరు రోజుల తరబడి ఎదురుచూస్తూనే వుంటారు. రైతు ఎదురుచూస్తుంటాడు ఋతుపవనాల కోసం... కారుమబ్బుల కోసం...ముత్యాల హారాల్లా జారిపడే వాన చినుకుల కోసం. ఎప్పుడెప్పుడు తన పొలంలోని బురదమట్టిలో కాలుమోపి పులకించిపోదామా...తొలకరి చినుకులలో తడిసి ముద్దవుదామా అని. 'ఒకవేళ ఎదురుచూపులు నెరవేరకపోతే ఆశ్చర్యపోవద్దు... జీవితమంటే అంతే' అంటారు బ్రిటిష్ మానసిక విశ్లేషకురాలు అనా ఫ్రాయిడ్. జీవితంలో ఎదురుచూపులు తప్పనిసరి. ప్రేయసీ ప్రియుల ఎదురుచూపులో ఒక భావుకత వుంటుంది. చాతక పక్షుల ఎదురుచూపులో ఒక మాధుర్యం... నిరీక్షణ వుంటుంది. కానీ, వాన కోసం ఎదురుచూసే రైతు కళ్ల నిండా ఆశ వుంటుంది. ఆ ఆశ వెనుక కన్నీటి వరదగుడి దాగివుంటుంది. ఋతుపవనాలనగానే రైతుల కళ్లలో కోటి ఆశలు మొలకెత్తుతాయి. త్వరగా ఋతుపవనాలు వచ్చి, వర్షాలు పడితే దుక్కిదున్ని, విత్తనాలు సిద్ధం చేసుకొని, నారుమళ్లు పోసుకొని పంటలకు సిద్ధపడదామా అనే ఆతృత వుంటుంది.

ఋతుపవనాలు వస్తున్నాయనగానే ప్రజల మనసుల్లో కాసింత ఉపశమనం కనిపిస్తుంది. మృగశిరలో ముంగిళ్లు చల్లబడతాయనే ఆశ చిగురిస్తుంది. వేసవి ఎండల నుంచి ఊరట లభిస్తుందన్న ఉత్సాహమూ కనిపిస్తుంది. వాస్తవానికి మృగశిర కార్తెలో వచ్చే నైరుతీ ఋతుపవనాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ఈ కార్తెను రైతులు ఏరువాక సాగేకాలం అంటారు. 'పడమట దిక్కున వరద గుడేసె/ ఉరుముల మెరుపుల వానలు గురిసె/ వాగులు వంకలు ఉరవడి జేసె/ ఎండిన బీళ్లూ ఇగుళ్ళు వేసె/ ఏరువాక సాగారో రన్నో చిన్నన్న/ నీ కష్ట మంత తీరునురో రన్నో చిన్నన్న' అంటూ... కోటి ఆశలతో వ్యవసాయానికి సన్నద్ధమౌతాడు రైతు. వర్షాకాలం వచ్చి పది రోజులైంది. మేఘాలు ఉరమటం లేదు. ఆకాశం మెరవటం లేదు. వానలు తరమటం లేదు. ప్రకృతిలో మార్పు కనిపించడంలేదు. 'మృగశిర కార్తెతో మొదలై ఉత్తర కార్తె కొచ్చేసరికి శిఖరం మీంచి దూకే జలపాతంలా రేగిపోవాల్సిన పచ్చదనం ఏదో జబ్బు చేసిన పిల్లాడిలా నీరసంగా పడివుంది' అంటాడు 'మబ్బులు వాలని నేల' నవలా రచయిత. ఒక్కోసారి ఈ కార్తెలో పెద్ద వానలొచ్చి చెరువు కట్టలు తెగిపోయిన ఏడాదులున్నాయి. ప్రస్తుతం ఎక్కడా చినుకు జాడ లేదు. మరోవైపు రోజురోజుకీ ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు ఎప్పుడు పడతాయా...అని కళ్ల నిండా ఆశలు నింపుకొని ఎదురు చూస్తున్నారు రైతులు. ఇదిగో ఋతుపవనాలు, అదిగో ఋతుపవనాలు అంటూ గత పది రోజులుగా ఎదురు చూస్తున్న రైతుల కళ్లలోని నీరు ఆవిరవుతున్నా... నింగి నుంచి చుక్క రాలడంలేదు. ఈ నెల 11న రాష్ట్రంలోకి ప్రవేశించిన ఋతుపవనాలు శ్రీహరికోట నుంచి ముందుకు కదలడంలేదు. దీంతో రాష్ట్రంలో తీవ్ర వడగాడ్పులు, అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

ఇప్పుడు వ్యవసాయం జూదంలా మారింది. ఈ నేలలో ప్రకృతికీ రైతుకు మధ్య సమతౌల్యం దెబ్బతిన్నది. ఋతువులు గతి తప్పుతున్నాయి. గ్రీష్మతాపానికి గొంతెండి, నెర్రలిచ్చిన భూమి...వాన చినుకు కోసం బేలగా చూస్తున్నది. సినారె చెప్పినట్లు 'బీట వారిన చేల పీయూషములు దేల సాగుమా ఓ నీలిమేఘమా' అంటూ ప్రేమగీతాలు ఆలపిస్తున్నది. 'గగన మదనాలింగ నోత్సాహియై బిగువు నిట్టూర్పు బాహువుల సెగలెగయగా' అంటూ స్వాగత వచనాలు పలుకుతున్నది. ఋతుపవనాల రాకతో వర్షం జూన్ మొదటి వారంలో మొదలై... జులై మొదటి వారానికి దేశమంతా వ్యాపిస్తుంది. ఈ సమయంలో వచ్చే వర్షం వ్యవసాయానికి చాలా కీలకం. 'కడవల ఉదకంబు ముంచి తెచ్చి వంచిన గతి' అని మొల్లమాంబ చెప్పినట్లు వర్షాలు పడ్డాయంటే... 'కమ్మని మట్టి వాసనల కానుక లిచ్చెద స్వీకరింపుమా' అన్నట్లుగా భూమి పరిమళాలు వెదజల్లుతుంది. రైతుల కళ్లలో వెలుగులు నిండుతాయి. రైతు ఆనందం ప్రపంచానికిక పండుగే పండుగ!

మహనీయుల మాట



చదువు మనిషిని పూర్తి మానవుడిగా
తీర్చిదిద్దుతుంది.
చర్చ సంసిద్ధ మానవుడిగా
తీర్చిదిద్దుతుంది.
రాత కచ్చితమైన మానవునిగా
తీర్చిదిద్దుతుంది.

- ఫ్రాన్సిస్ బేకన్,
బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు.

ఉద్యమ బలం, గళం, కలం ఎం.హెచ్

తెలకపల్లి రవి

విశ్లేషణ

> ఎం.హెచ్ అనే రెండక్షరాలతో నిలిచిపోయిన ఆ మనిషి ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి. ఆశయాలనూ ఆచరణనూ మేళవించిన అరుదైన అనుభవం ఆయనది. రాజీ పడని సిద్ధాంతబలం, కట్టు తప్పని పట్టుదల, ప్రమాణాలకు ప్రతిరూపమైన ప్రయాణం మోటూరుది. ప్రచార పటాటోపం లేని ప్రతిభ, ప్రజాసేవ ఆయన స్వంతం. సమాజంలో పదవుల కోసం పాకులాట, సంపదలకై వెంపర్లాట, అసహన దూషణలూ నీతిమాలిన మీడియా ధోరణులు ప్రబలుతున్న ఈ రోజున మోటూరు విలక్షణమైన ఆదర్శంగా గోచరిస్తారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం, సంపాదక కృషి, పార్లమెంటరీ ప్రస్థానం, నిరాడంబరత్వం, నిబద్ధత మార్గదర్శకమవుతాయి.

తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ మహత్తర పురోగమనానికీ ఆటుపోట్లకూ పునర్నిర్మాణాలకూ సారథ్యం వహించిన పెద్దలలో ప్రముఖ స్థానం వహించిన నేత మోటూరు హనుమంతరావు. ఎం.హెచ్ అనే రెండక్షరాలతో నిలిచిపోయిన ఆ మనిషి ఉద్యమాల మార్గదర్శి, అక్షరాల రూపశిల్పి. ఆశయాలనూ ఆచరణనూ మేళవించిన అరుదైన అనుభవం ఆయనది. రాజీ పడని సిద్ధాంతబలం, కట్టు తప్పని పట్టుదల, ప్రమాణాలకు ప్రతిరూపమైన ప్రయాణం మోటూరుది. ప్రచార పటాటోపం లేని ప్రతిభ, ప్రజాసేవ ఆయన స్వంతం. సమాజంలో పదవుల కోసం పాకులాట, సంపదలకై వెంపర్లాట, అసహన దూషణలూ నీతిమాలిన మీడియా ధోరణులు ప్రబలుతున్న ఈ రోజున మోటూరు విలక్షణమైన ఆదర్శంగా గోచరిస్తారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం, సంపాదక కృషి, పార్లమెంటరీ ప్రస్థానం, నిరాడంబరత్వం, నిబద్ధత మార్గదర్శకమవుతాయి. దశాబ్దాల పాటు ఆయన నాయకత్వంలో నడచిన నాటి నాయక శ్రేణికీ, తదుపరి తరంలో తనతో సన్నిహితంగా మసలిన మాలాంటివారికీ కూడా ఆయన జ్ఞాపకం ఒక చెరగని ఉత్తేజం. అంత సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వంతో పాటు కమ్యూనిస్టు పత్రికల నిర్వహణతోనూ అంతగా పెనవేసుకుపోవడం మోటూరుకే చెల్లింది.

నిర్బంధాలు, నిషేధాల మధ్యనే..

అక్టోబరు విప్లవంతో పుట్టానని సగర్వంగా చెప్పుకునే మోటూరు గుంటూరు ఎ.సి కాలేజీలో చదువుతున్నప్పుడే కమ్యూనిస్టు అయ్యారు. అది బ్రిటిష్ పాలనలో ఆ పార్టీపై నిషేధం వున్న కాలం. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, బాట్లీవాలా వంటి వారు వచ్చినపుడు ఆయన గది ఆశ్రయమైంది. చిన్న వయసులోనే వున్న కొద్ది పొలం అమ్మి గుంటూరులో 'సిటీ స్టూడెంట్స్ ఎంపోరియం' పేరిట పుస్తకాల షాపు పెడితే దానిపైనా సిఐడిలు దాడిచేశారు. అక్కడి నుంచి ఎలాగో తప్పించుకున్నారు. ఉత్తరోత్తరా మోటూరు ఉదయంగా మహిళా ఉద్యమ పతాకమెగరేసిన ఉదయలక్ష్మిని సంస్కరణ వివాహం చేసుకోవడం, కమ్యూనిస్టు పార్టీలో సభ్యులవడం 1937 లోనే జరిగాయి. లావు బాలగంగాధరరావు వంటి వారు సమకాలీనులైతే సుందరయ్య బయట నుంచి వచ్చి వెళ్లేవారు. మాకినేని బసవపున్నయ్య నుంచి మోటూరు గుంటూరు జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి బాధ్యత తీసుకున్నారు. 1942 వరకూ పార్టీపై నిషేధం, నిర్బంధం మధ్యనే ఉద్యమాన్ని పెంపొందించేందుకు కృషిచేశారు. క్షేత్రస్థాయి ఉద్యమ నిర్మాణం, నాయకత్వంతో పాటు పత్రికా రచన, కళా సాహిత్యంలోనూ ఎం.హెచ్ పట్టు పెంచుకున్నారు. అప్పుడే తెలంగాణ సాయుధ పోరాటం మొదలైంది. మొగల్‌రాజపురంలో కాట్రగడ్డ వారి పొగాకు బేరన్లలో నిర్మించుకున్న ప్రజాశక్తి నగర్ అందుకు సహాయ సామగ్రి అందించే ఆశ్రయమైంది. 1947లో వచ్చిన ప్రకాశం ఆర్డినెన్సు కమ్యూనిస్టులపై దారుణమైన వేటగా మారింది. ప్రజాశక్తి నగర్ ధ్వంసం చేయబడింది. అప్పటికే మోటూరు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుగా ఎన్నికైనారు. 'ప్రజాశక్తి' స్థానంలో మాసపత్రికగా 'జనత' తీసుకుని రావడానికి సన్నాహాలు జరిగాయి. 1977లో ప్రజాశక్తిలో చేరాక నేను పాత పత్రికలు తిరగేస్తుంటే జనత తొలి సంపాదకీయంలో ఎం.హెచ్ భాష కనపడింది. ఆయనను వెళ్లి అడిగితే తనే రాసిన సంగతి గుర్తుకు వచ్చింది. అయితే ఇంతలోనే ఆయను అరెస్టు చేయడంతో గంగినేని వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి గారు ఆ పత్రికను కొనసాగించారు. మొదటి నుంచి ఈ విధంగా పత్రికలతో ఎం.హెచ్ పాత్ర కనిపిస్తుంది. భయంకరమైన కడలూరు జైలు జీవితం గడిపారు. జైలులోనే పోలీసు కాల్పులు జరిపితే అనుమర్లపూడి సీతారామరావు బలికావడం, ఈయనకు కొద్దిలో గుండు తప్పిపోవడం జరిగాయి. ఇంకా చాలామందికి గాయాలు తగిలాయి. అనంతపురం తొలి పాత్రికేయులలో ఒకరైన రామకృష్ణ కు అప్పుడే ఒక కన్నుపోయింది. ఆయన కూడా చాలాకాలం ప్రజాశక్తి విలేకరిగా పనిచేశారు.

చట్టసభలు..జైలు శిక్షలు ..పత్రికలు..

నిషేధం ఎత్తివేత తర్వాత 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా జరిగిన తొలి ఎన్నికలలో ఎం.హెచ్ రేపల్లె నుంచి మంత్రి చంద్రమౌళిని ఓడించి శాసనసభకు ఎన్నికైనారు. కమ్యూనిస్టుల నాటి విజయపరంపరలో ఈ గెలుపు కూడా ఒక సంచలనం. 1953లో ఎం.హెచ్ విశాలాంధ్ర సంపాదకుడయ్యారు. సైద్ధాంతిక విభేదాల తర్వాత తనుగా ఆ బాధ్యతలకు రాజీనామా చేశారు. 1962, 1966లో ఆయనను రెండుసార్లు అరెస్టు చేసి జైళ్లలో పెట్టారు. 1964లో సిపిఎం రాష్ట్ర తొలి కార్యదర్శిగా ఎన్నికైన ఆయన తీవ్రవాద ఉద్యమ చీలిక కూడా చూశారు. ఎడాపెడా విచ్చిన్నాలనే పదం ఆయన నోట నిరంతరం వినిపించడానికి కారణమదే. ఈ రెండు సందర్భాలలోనూ ఉద్యమ పునర్నిర్మాణానికి కీలక బాధ్యత వహించారు. మొదట జనశక్తి తర్వాత ప్రజాశక్తి వారపత్రిక పున: ప్రారంభంలో సంపాదకుడుగా పేరు లేకపోయినా అన్ని కీలక విషయాలపైనా దిశానిర్దేశం చేసే రచనలందిస్తూనే వచ్చారు. 1974 నుంచి పెరిగిన కాంగ్రెస్ నిర్బంధానికి పరాకాష్టగా 1975 ఎమర్జన్సీ కూడా ఉద్యమానికి తీవ్ర సవాలు విసిరింది. అజ్ఞాతవాసంలో వుంటూనే ఎం.హెచ్ నాయకత్వం అందించారు. ఎమర్జన్సీ సెన్సార్‌షిప్‌లో కూడా సంజయ్ గాంధీ జాతరను అపహస్యం చేస్తూ 'అంజి' పేరిట ఆయన రాసిన 'రాజు వెడలె' సంచలనం తెచ్చింది. ఎమర్జన్సీ తర్వాత 1977 ఎన్నికలు, 1978లో శాసనసభ ఎన్నికలు అన్నిటా ఎం.హెచ్ ముందుండి పనిచేశారు. 1978లో శాసనమండలికి ఎన్నికైనారు. రాష్ట్రానికి తిరగివచ్చిన సుందరయ్య 1982లో రాష్ట్ర కార్యదర్శి అయ్యేవరకూ ఎం.హెచ్ 18 ఏళ్లపాటు బాధ్యతల్లో వున్నారు. 1953 నుంచి చివరి వరకూ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడుగా వున్న ఆయన 1998లో పొలిట్‌బ్యూరో సభ్యులయ్యారు. ఈ విధంగా ఎం.హెచ్ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో విధాన నిర్ణయంలో ఆద్యంతం ఒక ముఖ్య పాత్రధారి. 1986 నుంచి ఆరేళ్లపాటు రాజ్యసభ సభ్యులుగా వున్నారు. మధ్యలో ఒకటి రెండు సార్లు అనారోగ్యం వెంటాడినా జాగ్రత్తలు తీసుకుని మళ్లీ బాధ్యతల్లోకి రావడం ఆయన దీక్షా దక్షతలకు నిదర్శనం.



మోటూరు హనుమంతరావు 22వ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు ప్రదానోత్సవ సభ 20వ తేదీన పుట్టపర్తిలో జరుగుతున్న సందర్భంగా

వర్గ చైతన్య ఖడ్గధారి

తెలుగు నుడికారం, కమ్యూనిస్టు భావజాలం, రాజకీయ నైశిత్యం, వ్యంగ్యం మేళవించి కొత్త వరవడి తీసుకొచ్చారు. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కవితాత్మకంగా తెలుగు భాషను పోరాట భాషగా మార్చింది. ఎం.హెచ్ కలం తెలుగు భాషలో రాజకీయ వర్గచైతన్యపరమైన భావజాలానికి సరికొత్త పద సంపద సమకూర్చింది. మార్క్సిస్టు మేధావులు, పండితులు అనేక మంది వుండొచ్చు. కాని ఆ భాషను శక్తివంతంగా సిద్ధాంత రాజకీయ ప్రచారానికి వాడుకోగలిగిన వారిలో మాకినేని బసవపున్నయ్యనూ మోటూరును ప్రత్యేకంగా చెప్పుకోవాలి. గ్రామీణ జీవనం నుంచి, సంప్రదాయ ప్రయోగాల నుంచి, ఇంగ్లీషు వాడుకల నుంచి కలగలిపిన శక్తివంతమైన భాష అది. అనుభవం నుంచి పుట్టింది గనక అందులో కృత్రిమత్వం వుండదు. అద్దాల కొంపలో కూచుని రాళ్లు రువ్వడం, తెల్లజెండాలెత్తడం, కాసుకు కక్కుర్తి పడటం, చచ్చిన చేప వాలున పడి కొట్టుకుపోతే బతికిన చేప ఎదురీదడం, సలాం కొట్టడం, దివాళాకోరుతనం, నికరంగా నిలబడటం సూత్రబద్ధంగా నిలవడం, కంకణధారిగా పనిచేయడం ఇలాంటి పద ప్రయోగాలన్నీ ఆయనే ప్రాచుర్యంలోకి తెచ్చారు. తీరు తెన్ను అనే వాడుకను తీరుతెన్నులు చేసిందీ ఆయనే. కమ్యూనిస్టు పత్రికలను తీర్చిదిద్దిన వారిలో మద్దుకూరి చంద్రం తర్వాత ఆయననే చెప్పుకోవాలి. చివరి దాకా అదే కృషి కొనసాగించడం ఎం.హెచ్ ప్రత్యేకత. ఉద్యమ పరంగానూ పత్రికపరంగానూ ఇన్ని అనుభవాలు వున్నాయి గనకే చివరి దశలో వెంటబడి మరీ ఆయనతో అనేక జ్ఞాపకాలు రాయించడం మాకు చాలా సంతృప్తి కలిగించే విషయం. ఆయన మాట, రాత, వస్త్రధారణ, పలకరింపు, ఆదరణ విలక్షణమైనవి.

ప్రజాశక్తి పురోగమనంలో...

1981లో ప్రజాశక్తి దినపత్రికగా మారినప్పుడు మళ్లీ అప్పటి నుంచి ఇరవయ్యేళ్లు 2001 దాకా నిర్విఘ్నంగా సంపాదక బాధ్యతలు నిర్వహించిన ఎం.హెచ్ అనారోగ్య కారణాల వల్ల వైదొలగారు. కమ్యూనిస్టు పత్రికలకు భవిష్యత్తు లేదనే అంచనాలు అధిగమిస్తూ పలు ఎడిషన్లతో విస్తరించిన ప్రజాశక్తి పెరుగుదలలో నేను, వి.కృష్ణయ్య, కొరటాల తదితరులతో పాటు పనిచేయడం ఒక మంచి అనుభవం. నిజానికి మా కమ్యూనిస్టు కుటుంబంలో నాన్న నరసింహయ్య, అమ్మ లక్ష్మమ్మలతో పాటు బాల్యం నుంచి ఆయన గళాన్ని, కలాన్ని అనుసరిస్తూ వచ్చిన నాకు ఆయనతో సహ సంపాదకుడుగా కొన్నేళ్లు పనిచేయడం, ప్రత్యక్షంగా దీర్ఘకాలం ఆయన సూచనలు అందుకోవడం గొప్ప అవకాశం. ఇప్పటికీ ఏ కీలక సందర్భం వచ్చినా ఎం.హెచ్ ఎలా స్పందించేవారు, ఎలా ఏమి రాసేవారు తప్పక స్ఫురిస్తుంది. నా 'వెయ్యేళ్ల చరిత్ర'ను ఎం.హెచ్‌కు అంకితం చేస్తూ గతాన్ని, వర్తమానాన్ని కూడా వర్గ దృష్టితో చూడటమెలాగో నేర్పించిన వ్యక్తిగా ఆయనకు జోహారులర్పించానందుకే. నాలాంటి నా ముందటి రెండు మూడు తరాల కార్యకర్తలందరికీ ఆయన చెరగని స్ఫూర్తి. కొత్త ఆలోచనలను ఆహ్వానిస్తూ యువతను కలుపుకుని పోతూ మౌలిక విలువలను నిలబెట్టడంలో ఆయన పట్టువిడుపులు అనుసరణీయం. వాస్తవానికి ఎం.హెచ్ జీవితం మలి దశలో మతోన్మాదం పెరుగుదల, సోవియట్ విచ్ఛిన్నం, సమాజంలో స్వార్థపూరిత అవకాశవాదం వెర్రితలలు వేయడం సరళీకరణ వంటివన్నీ ఎదుర్కొన్నారు. ఇన్ని బాధ్యతలలోనూ సమస్యలలోనూ కార్యకర్తల పట్ల, తోటి నాయకుల పట్ల, సిబ్బంది పట్ల ఎం.హెచ్ చూపిన ప్రేమాభిమానాలు చెరగని ముద్ర వేశాయి. ఆయన కుటుంబం మొత్తం ఆ విధంగానే ఉద్యమంతో నిలబడటం కూడా ఇందులో భాగమే, ఉదయం గారైతే అందరికీ అమ్మే. ఉద్యమంలో తప్పనిసరైన సమిష్టి తత్వానికి పరస్పరత్వానికి వారి ప్రేమాభిమానాలు తార్కాణాలు.

2001 జూన్ 18న ఆయన మరణానంతర కాలంలో మోడీ రాకడ, కరోనా సవాలు వంటివీ చూశాము. ఇన్నిటి మధ్యనా ప్రజాశక్తి ముందుకు పోవడం, రాష్ట్ర విభజన తర్వాత నవతెలంగాణ పత్రిక ఏర్పాటు...ఇవన్నీ ఎం.హెచ్, ఇతర పెద్దలు వేసిన పునాదిపై వెలసినవే. తర్వాతి కాలంలో ఉద్యమానికి, పత్రికకూ కూడా నాయకత్వం వహించిన బాధ్యులు, నాయకులు ఆ మార్గాన ముందుకు సాగుతున్నందుకే...ఈ రోజున కలుషిత వివాదాస్పద రాజకీయ వాతావరణంలోనూ ప్రజాశక్తి విభిన్న వరవడితో ప్రత్యేకత నిలబెట్టుకోగలుగుతున్నది. మీడియాలో చొరబడిన అనారోగ్యకర ధోరణులను, సాంకేతిక ఆర్థిక సవాళ్లనూ తట్టుకుని విశిష్టత చాటుకుంటున్నది. ఎం.హెచ్, ఆయనతో పాటు దీర్ఘకాలం పనిచేసిన బొమ్మారెడ్డి పేర్ల మీద బహూకరించే అవార్డులు అందుకు ప్రతీకలుగా వుంటాయి.

మన కోర్టులలో మనువాదం!

ఆర్. రాజేశమ్

అభిప్రాయం

ఈ దేశపు న్యాయస్థానాలను నడిపించే చోదక శక్తి తానే అని చాటింపు వేస్తున్నట్టుగా రాజస్థాన్ హైకోర్టు ఆవరణలో మనువు విగ్రహం నేటికీ ఉన్నది. సమాజంలోని మెజారిటీ వర్గాలను, స్త్రీలను బానిసలుగా భావించిన మనువుకు ఆధునిక వ్యవస్థలో స్థానం లేదని.. ఆ విగ్రహాన్ని తొలగించాలంటూ బహుజన వర్గాల వారు, ప్రజాస్వామిక వాదులు, మహిళా సంఘాలూ ఉద్యమాలు చేసినా పాలకులు పట్టించుకోవడం లేదు. మనువు విగ్రహం బయట తిష్ట వేసుకోవడంతో పాటు.. మను భావజాలం న్యాయస్థానాలలోనూ నిండుకొని ఉన్నదని నేటికి ఎన్నో మార్లు నిరూపితమైంది.

తాజాగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్య న్యాయ స్థానమైన అలహాబాద్ హైకోర్టు సైతం మనుస్మృతిని నిలబెట్టే దిశలో ఒక ఉత్తర్వును విడుదల చేసింది. పెళ్లి పేరుతో మోసగించి, మానభంగం చేసిన ఒక వ్యక్తిపై బాధిత మహిళ ఫిర్యాదు చేయగా..పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. సదరు కేసు హైకోర్టుకు చేరగా...అమ్మాయి 'మాంగళిక్' (మంగళ (కుజ) దోషం ఉన్నది) కాబట్టి..పెళ్లి చేసుకోవడం కుదరదంటూ ఆ నిందితుడు ఉల్టా దబాయించాడు. ఆ నిందితుడి వాదనలను పరిగణనలోకి తీసుకున్న అలహాబాద్ హైకోర్టు...నిందితుడు, బాధితురాలి జాతకాలను అలహాబాద్ జ్యోతిష్య విద్యాలయం ప్రొఫెసర్‌కు పంపించాలని జ్యోతిష్య ప్రొఫెసర్ తేల్చిన విషయాల ఆధారంగా నిర్ణయం వెలువరిస్తామని ఉత్తర్వులు జారీచేసింది. మే 23న ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాధితురాలిని లైంగికంగా లోబరుచుకున్నప్పుడు అడ్డురాని కుజదోషము పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడు మాత్రం ఎలా అడ్డు వచ్చిందనే కనీస ప్రశ్న గౌరవ న్యాయమూర్తులకు తోచలేదు!

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వుల వార్త పేపర్లలో ప్రముఖంగా రావడంతో.. సామాన్య ప్రజలతో పాటు న్యాయ నిపుణులూ విస్తుపోయారు. జాతకాల ఆధారంగా న్యాయస్థానాలు నిర్ణయం తీసుకోవడమేమిటని సందేహం వెలిబుచ్చారు. చివరికి సుమోటోగా రంగ ప్రవేశం చేసిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్.. సదరు హైకోర్టు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. జాతకాలతో సంబంధం లేకుండా హైకోర్టు నిర్ణయం తీసుకోవాలంటూ జూన్ 3న ఆదేశాలిచ్చింది.

గమ్మత్తైన విషయం ఏమిటంటే.. సుప్రీంకోర్టు ముందు హాజరైన బాధితురాలి లాయర్ సైతం.. జ్యోతిష్య ప్రొఫెసరు తేల్చిన దానికి తామూ కట్టబడి ఉంటామని.. సదరు ఉత్తర్వుల పట్ల తమకు అభ్యంతరమేదీ లేదనీ తెలిపారు. అమ్మాయి ఒకవేళ 'మాంగళిక్'గా తేలిన పక్షంలో.. వివాహం జరిగే అవకాశమే లేదని ఆయన సైతం వాదించేవాడు. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులో ఎలాంటి అసమంజసత్వం లేదని.. ఇరువైపుల వారూ అందుకు సమ్మతించారని సదరు లాయర్ సుప్రీంకోర్టుకు తెలిపారు. జ్యోతిష్యం కూడా సైన్స్‌లో ఒక భాగమే.. నేడు యూనివర్సిటీలు సైతం జ్యోతిష్యంలో డిగ్రీల ప్రధానం చేస్తున్నవి అనే విలువైన అంశాన్ని (?) సైతం ఆ లాయరు సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. సుప్రీంకోర్టు వారు కూడా "ఆ అంశం లోకి మేము వెళ్లడం లేదు, జ్యోతిష్యమూ సైన్సేనని మేమూ ఒప్పుకుంటాము. అయితే, సదరు ఉత్తర్వులు మాత్రం అసంబద్ధమైనవి" అంటూ తీర్పునిచ్చారు.

మన న్యాయస్థానాల నుండి వెలువడే తీర్పులలో మనువు ముద్ర ఎన్నో మార్లు నిరూపితమైంది. 40 సంవత్సరాల క్రితం సంచలనం సృష్టించిన భన్వారీదేవి సామూహిక మానభంగం కేసు తీర్పులో సైతం గౌరవ న్యాయమూర్తులు మనువు మార్గానే నడిచారు. దళితురాలైన భన్వారీదేవి.. రాజస్థాన్ ప్రభుత్వం నిర్వహిస్తున్న మహిళా అభివృద్ధి కార్యక్రమంలో సాథిన్‌గా పనిచేసేది. ఆమె విధులు నిర్వహిస్తున్న భటేరీ గ్రామంలో ఒక తొమ్మిది నెలల పసికందుకు పెళ్లి చేయాలని ఊరిపెద్దలు ప్రయత్నించినపుడు.. ఆ దారుణానికి మౌనసాక్షిగా నిలబడలేని భన్వారీదేవి, పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ పెళ్ళిని అడ్డుకున్నది. తమ దురహంకారంపై దెబ్బ పడటంతో.. గ్రామ పెద్దలు సహించలేకపోయారు. అందులోనూ ఒక దళితురాలు తమని ఎదిరించడాన్ని పెద్దకులపు గుజ్జర్లు జీర్ణించుకోలేకపోయారు. మన దేశంలో నిమ్నవర్గాల స్త్రీలపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఉన్నది ఒకటే తోవ. దాని ప్రకారమే వారు 22 సెప్టెంబర్ 1992న ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు.



1995 నవంబర్ 15 జైపూర్ జిల్లా సెషన్స్ జడ్జి తీర్పునిస్తూ.. భన్వారీదేవిపై మానభంగమే జరగలేదని తేల్చేశారు. గౌరవనీయ న్యాయమూర్తి అందుకు గమ్మత్తైన కారణాలు చూపారు. తమ కుల పవిత్రతకు ప్రాధాన్యతనిచ్చే పెద్దకులపు వ్యక్తులు దళితురాలిపై అత్యాచారం చేయలేరని ఆయన తేల్చేశాడు. వైద్యపరీక్షలో నిందితుల వీర్య అవశేషాలు బాధితురాలి శరీరంపై లభించినా.. న్యాయమూర్తి ఆ సాక్ష్యానికి విలువ లేదన్నాడు. ఒక వ్యక్తి తన మేనల్లుడి సమక్షంలో సామూహిక అత్యాచారంలో పాల్గొనలేడు. గ్రామ పెద్ద మానభంగం చేయలేడు. వేరువేరు కులాలకు చెందినవారు సామూహిక మానభంగంలో కలిసి పాల్గొనలేరు.. అనే కారణాలను సైతం న్యాయమూర్తి జోడించాడు. రాష్ట్రంలో బిజెపి ఎమ్మెల్యే కన్నయ్యలాల్ మీనా, రాష్ట్ర రాజధాని జైపూర్‌లో నిందితుల విడుదలను స్వాగతిస్తూ పెద్ద ర్యాలీ నిర్వహించాడు. బిజెపి మహిళా విభాగం సైతం భన్వారీదేవినే నిందిస్తూ ప్రచారం చేపట్టింది. మహిళా సంఘాలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడంతో.. తప్పనిసరి పరిస్థితులలో.. రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు అప్పీలు చేసింది. సదరు అప్పీలు నేటికీ రాజస్థాన్ హైకోర్టు విచారణలో వున్నది. బాధితురాలు భన్వారీదేవికి న్యాయం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలి ఉన్నది.


మన న్యాయాధిపతుల్లో కొందరికి మనుస్మృతి పట్ల విపరీతమైన గౌరవం ఉందన్న సంగతి బహిర్గతమే. నేడు ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న అబ్దుల్ నజీర్.. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు.. మనువు, కౌటిల్యుడి బోధనలను నేటి భారత న్యాయ వ్యవస్థ అనుసరించాలని, పాశ్చాత్య దేశాల నుండి స్వీకరించిన న్యాయ వ్యవస్థ మనకు పనికిరాదని ఉద్బోధించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీమతి ప్రతిభా సింగ్.. గత సంవత్సరం ఆగస్టులో ఢిల్లీలో జరిగిన ఫిక్కీ సమావేశంలో ప్రసంగిస్తూ.. మనుస్మృతితో సహా భారతీయ స్మృతులన్నీ మహిళలకు గొప్ప గౌరవాన్ని ఆపాదించాయంటూ పొగిడేశారు. 'స్త్రీలు ఎదుర్కొంటున్న అవాంతరాలు' అనే అంశంపై ప్రసంగించిన ఆమె.. భారతదేశంలోని స్త్రీలు మిగతా దేశాల స్త్రీల కంటే అదృష్టవంతులని, మనువు స్త్రీలకు ఉన్నత స్థానాన్ని ఇచ్చాడని పేర్కొన్నారు. 'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని ఘోషించిన మనువు పట్ల ఆమె మనోగతమది. భారత రాజ్యాంగం ప్రవచించిన సమానత్వ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్న గ్రంథాలను గౌరవ న్యాయమూర్తి పొగడడం పట్ల మహిళా సంఘాలు ఆందోళన వ్యక్తపరిచాయి.

మొన్నటి సుప్రీంకోర్టు నిర్ణయం తర్వాత నెలకొన్న పరిస్థితి ఏమిటంటే.. 'కుజ దోష ప్రమాదం' తాత్కాలికంగా వెనక్కు నెట్టి వేయబడినా.. 'జ్యోతిష్య శాస్త్ర ప్రమాదం' మాత్రం ఇంకా పొంచి ఉన్నది. ప్రజల్లో హేతుబద్ధ ఆలోచనా ధోరణిని పెంపొందించే దిశలో ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని నిర్దేశిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ పై నీలి నీడలు ఆవరించి ఉన్నాయి. సామాజిక ప్రగతికి ఆటంకంగా నిలిచిన మనువాదం అంతరించాలని..రాజ్యాంగం దృఢతరం కావాలని.. ఆకాంక్షించే వారందరికీ ఆందోళన కలిగించే అంశాలివి.

/వ్యాసకర్త సెల్: 9440443183 /

కవిత్వం

అబ్బబ్బో మన విద్యుత్తూ!



అబ్బబ్బో మన విద్యుత్తూ
లబోదిబో ప్రజ యావత్తూ!
బిల్లులు చూస్తే ఠారెత్తూ
పళ్ళు కొరికి ఇక పిడికిలి ఎత్తూ!

అసలుకన్నా కొసరే ఎక్కువ
అదనపు ఛార్జీలు తడిసి మోపెడు
'ట్రూ అప్' లతో వీర రాపిడి
ప్రజలందరికీ నిలువు దోపిడీ!

వినియోగపు ఛార్జీలకు తోడు
విద్యుత్తు సుంకం, డిమాండు
చార్జీ
ఇంధన చార్జీ, ఇ.డి, ఇంట్రెస్టు
కస్టమర్ చార్జీ, ఇష్టారాజ్యం!

లైటేస్తే అది డిస్కో డాన్సు
ఫాన్ ఆనైతే డుర్రు డుర్రు
లో ఓల్టేజి సమస్య తీరదు
కరెంటు కోతల తీరు మారదు!

ఎండలు చూస్తే భగభగ మండే
ముసలి, ముతక మూర్ఛలు
పోయే
కొడుకులు ఏ.సి. కొంటానంటే
పింఛను పోతుందంటూ బెంగ!

వ్యవసాయానికి పెట్టే మీటరు
ఉచిత కరెంటుకు మూడే ఎసరు
రైతులకెన్నో బాధల ముసురు
తిండిగింజలకు వచ్చే కొసరు!

ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లంట
నెలనెలా రేట్లు పెరిగేనంట
ముందస్తు రీఛార్జి కార్డులు
అయిపోతే అర్ధరాత్రి భజనలు!

స్మార్ట్ మీటర్ల ఖర్చుల మోత
తొమ్మిది, పదేళ్ళు అప్పుల ఖాతా
అద్దెదారులకు అదనపు వాత
పీక్ అవర్స్‌లో రేట్ల జాతా!

ఎన్ని పోర్షన్లు ఉన్నాగాని
ఇంటికి ఒకటే మీటరు అంట
స్లాబులు పైకి దూసుకుపోయి
బిల్లులు బాగా వాచిపోవులే!

విద్యుత్తే అన్నిటికీ దిక్కు
అదిలేకుంటే పెద్ద చిక్కు
కార్పోరేట్లకు మహా లాజిక్కు
పాలకులకు అది భలే మేజిక్కు!

నవరత్నాల పేరు చెప్పి
నవనాడులను మూసేస్తున్నరు
ఊపిరాడక ఉక్కిన ప్రజలు
మీ గద్దెకు కరెంటు
షాకులెడతరు!!

- చైతన్యప్రసాద్
సెల్ : 98496 51451

విచారణ చేసేది ఇలాగేనా?

- దర్యాప్తులో పస లేదు
- కట్టుకథలు సృష్టించారు
- ఆధారాలు చూపలేకపోయారు
- సాక్షుల విశ్వసనీయతపై అనుమానాలున్నాయి
- ఢిల్లీ అల్లర్ల కేసుల్లో పోలీసుల తీరును తూర్పారపట్టిన న్యాయస్థానాలు

న్యూఢిల్లీ : 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన అల్లర్లు గుర్తున్నాయా?. ఆ హింసాకాండలో 53 మంది ప్రాణాలు కోల్పోగా 700 మందికి పైగా గాయాలపాలయ్యారు. ఫిబ్రవరి 23 నుండి 27వ తేదీ వరకూ నాలుగు రోజుల పాటు దేశ రాజధానిలోని ఈశాన్య ప్రాంతం హింసతో అట్టుడికిపోయింది. ఢిల్లీ పోలీసులు 758 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే విచారణ సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆజమాయిషీలో నడిచే ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుపై న్యాయస్థానాలు తీవ్రమైన వ్యాఖ్యలు చేశాయి. పలు కేసులలో నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టిన న్యాయస్థానాలు, పోలీసులు సాక్ష్యాలను సృష్టించారని, వారి వాదనలో పస లేదని, దర్యాప్తు పేలవంగా ఉందని మండిపడ్డాయి. కొన్ని కేసుల విషయంలో పోలీసులు జరిపిన విచారణ విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించాయి. పలు కేసులలో నిర్దోషులుగా తేలిన బాధితులు చేయని నేరాలకు అనేక నెలల పాటు కారాగారంలో మగ్గాల్సి వచ్చిందని, కొందరైతే సంవత్సర కాలానికి పైగా జైలులో గడిపారని గుర్తు చేశాయి.

ఢిల్లీ పోలీసుల విచక్షణ పైన, అప్రజాస్వామికంగా జరిగిన విచారణ పైన తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తూ న్యాయమూర్తులు వెలువరించిన తీర్పుల ప్రతులు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. పోలీసులు న్యాయస్థానాల విలువైన సమయాన్ని వృథా చేయడమే కాకుండా పలు కేసులలో కట్టుకథలు అల్లి వాటిని ఏ విధంగా సాక్ష్యాలుగా చూపారో బయటపడింది.

ఇర్షాద్ అహ్మద్ అనే నిందితుడికి ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ రెండు వారాల పాటు సాక్షులు మౌనం వహించడాన్ని బట్టి చూస్తే వారి విశ్వసనీయతపై తీవ్రమైన అనుమానాలు కలుగుతున్నాయని వ్యాఖ్యానించింది. నిందితులను గుర్తించిన విక్రమ్, పవన్ అనే కానిస్టేబుళ్లు సంఘటన జరిగిన రోజు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, కనీసం తమ సీనియర్లకు తెలియజేయలేదని ఎత్తిచూపింది. ఫిబ్రవరి 25న జరిగిన సంఘటనకు సంబంధించి మార్చి 6న స్టేట్‌మెంట్లు నమోదు చేసే వరకూ వారిద్దరూ మౌనంగానే ఉన్నారని తెలిపింది. ఎఫ్‌ఐఆర్‌లో అహ్మద్ పేరే లేదని, ఆయనపై నిర్దిష్ట ఆరోపణలు కూడా చేయలేదని ప్రస్తావించింది. సీసీటీవీ ఫుటేజ్‌లో కూడా ఆయన ఎక్కడా కన్పించలేదని న్యాయస్థానం తన తీర్పులో స్పష్టం చేసింది. దుకాణంపై దాడి చేసిన ఇతర వ్యక్తులను గుర్తించి, అరెస్ట్ చేయాల్సి ఉండగా ఏకైక కారణంతో అహ్మద్‌ను జైలులో పెట్టారంటూ పోలీసుల తీరుపై మండిపడింది.



మరో కేసులోనూ సాక్షులుగా ఉన్న పోలీసుల విశ్వసనీయతను కోర్టు ప్రశ్నించింది. ఫిబ్రవరి 24వ తేదీ నాటి సిసిటివి ఫుటేజీపై పోలీసులు ఆధారపడ్డారని, కానీ సంఘటన జరిగింది ఆ మరునాడని ఎత్తిచూపింది. నిందితులను చూసిన ఇద్దరు ముస్లింలను పోలీసులు సంఘటనా స్థలంలో అరెస్ట్ చేయలేదని, 55 రోజుల తర్వాత అదుపులోకి తీసుకున్నారని తెలిపింది. కాగా సరైన ఆధారాలు లేకుండా మరో కేసులో నలుగురు నిందితులకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 24న వీరు అల్లర్లకు పాల్పడ్డారని, వాహనాలు తగలబెట్టారని, దోపిడీ చేశారని ఆరోపిస్తూ కేసు పెట్టారు. అయితే పోలీసులు తగిన ఆధారాలు చూపలేకపోయారని, ఎఫ్‌ఐఆర్‌లో కూడా వారి పేర్లు చేర్చలేదని హైకోర్టు తెలిపింది. సంఘటన జరిగిన మూడు రోజుల తర్వాత ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని, మార్చి 14న సాక్షుల స్టేట్‌మెంట్లు నమోదు చేశారని వివరించింది. అరెస్టయిన వారందరూ ముస్లింలే.

అల్లర్లకు సంబంధించి అనేక ఆరోపణలపై అరెస్ట్ చేసిన రషీద్ అనే వ్యక్తి పేరును కూడా ఎఫ్‌ఐఆర్‌లో చేర్చలేదు. ఆయన ప్రమేయాన్ని కూడా నిరూపించలేకపోయారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే సంఘటన జరిగిన 55 రోజుల తర్వాత రషీద్‌ను అరెస్ట్ చేశారు. మెడికల్ షాపును లూటీ చేస్తుండగా రషీదును చూశానని చెప్పిన కానిస్టేబుల్, ఆ విషయాన్ని స్టేషన్‌లో ఎందుకు చెప్పలేదని కోర్టు ప్రశ్నించింది.

కాగా పోలీసులు సాక్షులుగా చూపిన వారిలో ఒకరి పేరును పలు కేసులలో ప్రస్తావించడాన్ని న్యాయస్థానం గుర్తించింది. ఒకే సమయంలో రెండు సంఘటనలను సాక్షి ఎలా చూడగలడని ప్రశ్నించింది. కాగా ఫిబ్రవరి 25న సురేష్ అనే వ్యక్తి అల్లరిమూకతో కలిసి ఒక షాపు తాళం పగలగొట్టి దోపిడీకి పాల్పడ్డాడంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. 2020 ఏప్రిల్ 7వ తేదీన అతనిని అరెస్ట్ చేయగా 2021 ఫిబ్రవరి 25న బెయిల్ వచ్చింది. అల్లరిమూకలో సురేష్ ఉన్నాడన్న విషయాన్ని పోలీసులు రుజువు చేయలేకపోయారని కోర్టు తెలిపింది. మరో కేసులో కూడా ముగ్గురు నిందితులను న్యాయస్థానం నిర్దోషులుగా విడిచిపెట్టింది. కేసు విచారణలో ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించడంలో పోలీసులు విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. సంఘటనను పోలీస్ స్టేషన్‌లో తెలియజేయడంలో జరిగిన జాప్యాన్ని గమనిస్తే ఈ కేసులో కానిస్టేబుల్‌ను వాడుకున్నారేమోనన్న అనుమానం కలుగుతోందని తెలిపింది. కేవలం చార్జిషీటు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని, ప్రత్యక్ష సాక్షులను గుర్తించేందుకు, అసలైన దోషులను పట్టుకునేందుకు ప్రయత్నమే చేయలేదని అభిశంసించింది.

అస్పష్టమైన ఆధారాలతో, సాధారణమైన ఆరోపణలతో ఓ గుంపుపై హత్యారోపణలు చేయరాదని చెబుతూ ఢిల్లీ హైకోర్టు ఐదుగురు నిందితులకు బెయిల్ ఇచ్చింది. ఈ ఐదుగురు ముస్లింలను వేర్వేరు సందర్భాలలో అరెస్ట్ చేశారు. వీరందరూ 12 నుండి 18 నెలల పాటు జైలులో గడపాల్సి వచ్చింది. వీరిని జైలులో పెట్టడానికి కావాల్సిన ఆధారాలేవీ లేవని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాగా దర్జీ షాపును తగలబెట్టారన్న ఆరోపణతో అరెస్టయిన నూర్ మహమ్మద్ అనే వ్యక్తిని కోర్టు నిర్దోషిగా విడిచిపెడుతూ విచారణాధికారి పరస్పర విరుద్ధమైన స్టేట్‌మెంట్లు ఇచ్చారని తెలిపింది. మరో కేసులో సాక్షుల వాంగ్మూలం అనుమానాస్పదంగా ఉందని అంటూ ఇద్దరు నిందితులను కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టింది. ఇంకొక కేసులో విచారణ నాణ్యత సరిగా లేదంటూ న్యాయస్థానం పోలీసులను తప్పుపట్టింది. ముగ్గురు నిందితులనూ నిర్దోషులుగా వదిలిపెట్టింది. పోలీసులు 27 కేసులను కలిపేసి విచారించారని తెలిపింది. ఒకే ఎఫ్‌ఐఆర్‌లో ఫిర్యాదుదారుల పేర్లు రెండుసార్లు పేర్కొన్నారని ప్రస్తావించింది.

వివిధ కేసుల విచారణ సందర్భంగా న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే పోలీసుల విచారణ ఎంత పేలవంగా జరిగిందో అర్థమవుతుంది. సాక్షుల వాదనలు అనుమానాస్పదంగా ఉన్నాయని, పోలీసులు చూపిన ఆధారాలు అస్పష్టంగా ఉన్నాయని, విచారణలో ఉదాశీనత కన్పించిందని, నేరాలను నిరూపించడంలో దారుణంగా విఫలమయ్యారని, పోలీసుల సాక్ష్యం విశ్వసనీయంగా లేదని.... ఇలా వేర్వేరు వ్యాఖ్యలతో పోలీసుల తీరును న్యాయస్థానాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే పోలీసులు తప్పుడు కేసులతో అరెస్ట్ చేసిన వారిలో ఎక్కువ మంది ముస్లిం మైనారిటీలే.

జాతీయ జల అవార్డుల్లో ఎపికి మూడో ర్యాంక్

- ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ నీటి అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్థానం లభించింది. శనివారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో నాల్గవ జాతీయ జల అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ అవార్డులను ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌ఖర్ ప్రదానం చేశారు. ఈ ర్యాంకింగ్స్‌లో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. తరువాతి రెండు, మూడు స్థానాల్లో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నిలిచాయి. మొత్తం 11 విభాగాల్లో పురస్కారాలు అందజేశారు. జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, సహాయ మంత్రులు బిశ్వేశ్వర్ తుడు, ప్రహ్లాద్ సింగ్ పటేల్ పాల్గొన్నారు. రాష్ట్రం తరపున జలవనరుల అభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పురస్కారం అందుకున్నారు. ఉత్తమ పాఠశాల విభాగంలో నంద్యాల జిల్లా చాగలమర్రిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం రెండో స్థానం, ఉత్తమ పరిశ్రమల విభాగంలో తిరుపతికి చెందిన సిసిఎల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ మూడోస్థానం పొందాయి. ఉత్తమ ప్రభుత్వేతర సంస్థల విభాగంలో అనంతపురంలోని ఆక్టా ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్‌కు స్పెషల్ కన్సోలేషన్ ప్రైజ్ లభించింది.

ఉత్తమ జిల్లాల్లో తెలంగాణాలోని ఆదిలాబాద్‌కు మూడో స్థానం లభించింది. గ్రామ పంచాయతీ కేటగిరిలో దేశంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జగన్నాథపురం గ్రామానికి అవార్డు దక్కింది. నీటి విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించినందుకు భద్రాది కొత్తగూడెం జిల్లా జగన్నాథపురానికి అవార్డు వరించింది. ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌ఖర్ చేతుల మీదుగా జగన్నాథపురం సర్పంచ్ గడ్డం భవాని, పంచాయతీ కార్యదర్శి షేక్ ఇబ్రహీం ఈ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి రెండో అవార్డు దక్కింది.

మణిపూర్‌లో చల్లారని హింస

- బిజెపి నేతల ఇళ్లకు నిప్పంటించేందుకు యత్నాలు
- స్థానిక నేతపై రాజద్రోహం కేసు

ఇంఫాల్ : మణిపూర్‌లో సంక్షోభం నెలకొనడానికి కారణం రాష్ట్రంలోని అస్సాం రైఫిల్స్ యూనిట్ అని వ్యాఖ్యానించినందుకు ఇంఫాల్‌కి చెందిన రాజకీయ నేతపై పోలీసులు రాజ ద్రోహం కేసును నమోదు చేశారు. అస్సాం రైఫిల్స్ ఇనస్పెక్టర్ జనరల్ (ఐజిఎఆర్) (దక్షిణ) ప్రధాన కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు జగత్ తౌడమ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదైందని ఫ్రాంటియర్ మణిపూర్ పేర్కొంది. తోడమ్ వ్యాఖ్యలను పలు వార్తాపత్రికలు ప్రచురించిన నేపథ్యంలో ఐజిఎఆర్ (దక్షిణ) ఈ మేరకు ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది.

ఇంఫాల్ జిల్లాలో ఫ్లాగ్ మార్చ్

రాష్ట్రంలో హింస కొనసాగుతునే వుంది. గురు, శుక్రవారాల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులకు చెందిన ఇళ్లకు నిప్పంటించారు. శుక్రవారం పొద్దుపోయిన తర్వాత మంత్రి తొంగమ్ బిశ్వజిత్ ఇంటిని ధ్వంసం చేయడానికి దాదాపు 300మందితో కూడిన అల్లరి మూక ప్రయత్నించింది. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఎఎఫ్) దళాలు వారిని తరిమిగొట్టాయి. ఇంఫాల్ నగరమంతా ఇటువంటి అల్లర్లు, ఘర్షణల సంఘటనలు ఎక్కడో అక్కడ జరుగుతూనే వున్నాయి. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎ.శారదా దేవి ఇంటిని కూడా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. సింగ్జామి వద్ద బిజెపి కార్యాలయాన్ని ఘెరావ్ చేసిన వారిని సైనికులు చెల్లాచెదురు చేశారు. అనంతరం సైన్యం, అస్సాం రైఫిల్స్, ఆర్‌ఎఎఫ్ బలగాలు ఇంఫాల్ ఈస్ట్ జిల్లాలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించాయి. నెల రోజుల క్రితం ప్రారంభమైన ఈ హింసలో ఇప్పటివరకు 115మంది చనిపోయారు. 11జిల్లాల్లో ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. ఇంటర్‌నెట్ సేవలను స్తంభింపచేసింది.

బిజెపితో పొత్తుపై పునరాలోచన : ఎన్‌పిపి

మణిపూర్‌లో హింస ఆగకపోతే బిజెపితో పొత్తుపై పునరాలోచన చేయాల్సి ఉంటుందని నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) స్పష్టం చేసింది. ఆ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సిఎం యుమ్నం జోయ్‌కుమార్ సింగ్ మీడియాతో ఈ విషయం తెలిపారు. ఆర్టికల్ 355 మణిపూర్‌లో అమలులో ఉందన్నారు. కాబట్టి ప్రజలను రక్షించడం రాష్ట్రం, కేంద్రం కర్తవ్యమని తెలిపారు.

ఐద్వా ఖండన

మణిపూర్‌లో నెలన్నర రోజులుగా కొనసాగుతున్న హింసాకాండను ఐద్వా ఖండించింది. రాష్ట్రంలో గుర్తింపు రాజకీయాల కోసం పాకులాడుతున్న ప్రస్తుత బిజెపి రాష్ట్ర ప్రభుత్వం కుకీ గిరిజనులు, గిరిజనేతరులైన మెయిటీల మధ్య శతృత్వాన్ని రెచ్చగొట్టిందని ఐద్వా ఒక ప్రకటనలో విమర్శించింది. పెద్ద సంఖ్యలో చర్చిలను తగలబెట్టి ఈ అత్యాచారాలకు మతం రంగు పులిమారని విమర్శించింది. ఇన్ని రోజులుగా కొనసాగుతున్న అల్లర్లతో మణిపూర్ మహిళలు తీవ్ర ప్రమాదంలో వున్నారని అన్నారు. వారి జీవనోపాధి దెబ్బతిందని, సాధారణంగా సాగే వారి జీవితాలు ప్రమాదంలో పడ్డాయని పేర్కొంది. ఇక పిల్లలకు నిరవధికంగా స్కూళ్ళు లేవు, ఈ పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం దాదాపు నెల రోజులుగా మౌనం పాటిస్తోంది. కేంద్రంలో, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు హింసను ఆపి, సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడలేకపోయారని ఐద్వా విమర్శించింది. తక్షణమే రాజ్యాంగ బాధ్యతలకు అనుగుణంగా వ్యవహరించేలా కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని ప్రజలను కోరింది. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరింది.

వడగాల్పులకు యుపిలో 34 మంది మృతి

లక్నో : ఎండ వేడిని తట్టుకోలేక గత రెండు రోజుల్లోనే ఉత్తరప్రదేశ్‌లో 34 మంది మరణించినట్లు శనివారం అధికారులు తెలిపారు. మృతులంతా 60 ఏళ్ల పైబడినవారేనని అధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోకు ఆగ్నేయంగా 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న బల్లియా జిల్లాలో ఈ మరణాలు సంభవించాయి. గురువారం 23 మంది మరణించగా, శుక్రవారం మరో 11 మంది మరణించారని బల్లియా చీఫ్ మెడికల్ ఆఫీసర్ జయంత్ కుమార్ తెలిపారు.

బిపర్‌జోయ్ ప్రభావిత ప్రాంతాల్లో అమిత్‌షా ఏరియల్ సర్వే

కచ్ : గుజరాత్ కచ్‌లోని బిపర్‌జోయ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో కలిసి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శనివారం ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు ఆ రాష్ట్ర సిఎం భూపేంద్రపటేల్‌తోపాటు, ఇతర ఉన్నత అధికారులతో అమిత్‌షా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఇక అమిత్‌షా మాండ్విని సందర్శించనున్నారు. ఆ తర్వాత తుఫాను కారణంగా ప్రభావితమైన ప్రజలను ఆయన కలుసుకోనున్నారు. అలాగే భుజ్‌లోని స్వామి నారాయణ్ ఆలయాన్ని షా సందర్శించనున్నారు. వరద బాధితులకు అందిస్తున్న ఆహార పదార్థాలు, ఇతర సౌకర్యాలపై ఆయన సమీక్షించనున్నారు. గురువారం రాత్రి గుజరాత్ కచ్‌లోని జాఖౌ నౌకాశ్రయానికి ఉత్తరంగా 10 కిలోమీటర్ల దూరంలో బిపర్‌జోయ్ తుఫాను తీరాన్ని దాటింది. ఈ తుఫాను వల్ల గుజరాత్‌లో ప్రాణనష్టం సంభవించలేదు కానీ... ఆర్థిక నష్టం సంభవించిందని అధికారులు వెల్లడించారు.

4కోట్లకు చేరిన కెనడా జనాభా

- ఏడాదిలో పది లక్షల పెంపు

ఒట్టావా : శుక్రవారం నాటికి కెనడా జనాభా నాలుగు కోట్ల మైలురాయికి చేరిందని అధికారిక గణాంకాలు తెలిపాయి. ప్రస్తుతం కెనడా జనాభా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. 2022లో కెనడా జాతీయుల సంఖ్య 10,50,110 పెరిగింది. ఒక్క ఏడాది కాలంలోనే పది లక్షల మందికి పైగా జనాభా పెరగడం కెనడా చరిత్రలో ఇదే మొదటిసారని జాతీయ గణాంకాల సంస్థ పేర్కొంది. దీంతో వార్షిక వృద్ధిరేటు 2.7శాతానికి చేరుకుంది. 1950ల్లో వృద్ధిరేటును నమోదు చేశారు. ఆనాడు జననాల పెరుగుదలకు రెండవ ప్రపంచ యుద్ధానంతరం వచ్చిన బేబీ బూమ్ కారణమని భావించారు. జనాభా వృద్ధిలో జి 7 దేశాల్లోకెల్లా కెనడా ముందంజలో వుందని గణాంకాల సంస్థ పేర్కొంది. రాబోయే సంవత్సరాల్లో కూడా ఇదే రీతిన జనాభా పెరుగుదల రేటు కొనసాగితే 26ఏళ్లలో కెనడా జనాభా రెట్టింపు కాగలదని సంస్థ తెలిపింది.

బ్రిజ్ భూషణ్‌పై ఫొటోలు, వీడియోల సాక్ష్యాలు !

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఫొటోలు, వీడియో సాక్ష్యాధారాలను ఢిల్లీ పోలీసులు సేకరించినట్లు తెలుస్తోంది. ఆయనపై ఆరుగురు మహిళలు ఫిర్యాదు చేయగా, నలుగురి ఫిర్యాదుల్లో ఫొటో సాక్ష్యాలు, ముగ్గురి ఫిర్యాదుల్లో వీడియో సాక్ష్యాలు ఉన్నట్లు సమాచారం. ఈ కేసుల్లో ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన 1,500 పేజీల చార్జిషీటులో ఈ ఆధారాలను కోర్టుకు సమర్పించినట్లు జాతీయ మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. మహిళా రెజ్లర్ల ఫిర్యాదులపై నిర్వహించిన దర్యాప్తులో భాగంగా 200 మందికిపైగా సాక్షుల స్టేట్‌మెంట్లను ఢిల్లీ పోలీసులు రికార్డు చేశారు. బాధితుల ఆరోపణలకు బలం చేకూర్చే స్టేట్‌మెంట్లను చార్జిషీటులో పొందుపరచి, కోర్టుకు సమర్పించారు. 100 స్టేట్‌మెంట్లు ఈ ఆరోపణలకు బలం చేకూర్చేవిగా ఉన్నాయని పోలీసులు గుర్తించారు. ఫొటోలు, వీడియోలు, కాల్ రికార్డులు వంటి టెక్నికల్ ఎవిడెన్స్ (సాంకేతిక ఆధారాలు)ను కూడా కోర్టుకు సమర్పించారు. దీనిపై కోర్టు విచారణ ఈ నెల 22న జరగనుంది.

డబ్ల్యుఎఫ్ఐ కార్యాలయం, టోర్నమెంట్లు, క్యాంపులు, ఇతర కార్యక్రమాలు జరిగేటప్పుడు తమపై బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు మహిళా రెజ్లర్లు ఆరోపించారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. పతకాలు పొందిన సందర్భంగా జరిగిన కార్యక్రమాలు, గ్రూప్ ఫొటోలు తీసుకున్న సందర్భాల్లో తీయించుకున్న ఫొటోలు, వీడియోలను ఫిర్యాదుదారులు సమర్పించారని పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనాలు, టోర్నమెంట్ రిఫరీలు, సిబ్బంది, కో-పార్టిసిపెంట్ల స్టేట్‌మెంట్లను కూడా చార్జిషీటులో పొందుపరచినట్లు తెలిపారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను అందజేయాలని కోరుతూ ఐదు దేశాల రెజ్లింగ్ ఫెడరేషన్లకు ఢిల్లీ పోలీసులు లేఖలు రాశారు. ఆ దేశాలు స్పందించి, ఆధారాలను సమర్పిస్తే, బ్రిజ్ భూషణ్‌పై అనుబంధ చార్జిషీటును దాఖలు చేస్తారు.

రెజ్లర్లపై ఎఫ్‌ఐఆర్ రద్దు చేయాలి

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ తదితరులు నిరసన తెలుపుతున్న సమయంలో మే 28న జరిగిన ఘర్షణకు సంబంధించిన కేసులో రెజ్లర్లకు వ్యతిరేకంగా నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయిస్తారు.

పాకిస్తాన్‌కు వందకోట్ల డాలర్ల చైనా సాయం

ఇస్లామాబాద్ : నగదు సంక్షోభంతో సతమతమవుతున్న పాకిస్తాన్ తన మిత్రదేశం చైనా నుంచి వంద కోట్ల డాలర్ల నగదు అందుకుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి రుణంపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో విదేశీ మారక నిల్వలు అత్యంత తక్కువగా వున్నసమయంలో చైనా సాయం అందింది. పాకిస్తాన్ స్టేట్ బ్యాంక్ శుక్రవారం రాత్రి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అంతకుమించి వివరాలు బ్యాంక్ వెల్లడించలేదు. ఇటీవలి వారాల్లో దాదాపు 390 కోట్ల డాలర్లకు పడిపోయిన విదేశీ మారక నిల్వలకు చైనా అందించిన సాయం తోడవుతుంది. అంతకుముందు పాకిస్తాన్ ఆర్థిక మంత్రి ఇషాక్ దర్ మాట్లాడుతూ, చైనాకు 130 కోట్ల డాలర్లు చెల్లించాల్సి వుండగా, గత సోమవారం 100 కోట్ల డాలర్లు చెల్లించామని చెప్పారు. ఆ మొత్తం తిరిగి రాగలదని భావిస్తున్నట్లు చెప్పారు. ఐఎంఎఫ్ మద్దతు లేకపోవడంతో పాకిస్తాన్‌కు బహుముఖ రుణాలు లేదా ద్వైపాక్షిక సాయం అందడం లేదు. ఈ దశలో చైనా ఈ సాయాన్ని అందజేసింది.



మధ్యధరా సముద్ర జలాల్లో విషాదం

- బోటు బోల్తా పడి 500మంది శరణార్థులు మునక
- 104మందిని కాపాడిన కోస్ట్‌గార్డులు
- 79మృత దేహాలు లభ్యం
- మృతుల్లో వంద మంది వరకు చిన్నారులే
- గ్రీస్‌లో నిరసనలు
- సమగ్ర వలస విధానం కొరవడడంపై ఇయుపై, గ్రీస్‌పై విమర్శల వెల్లువ

ఏథెన్స్ : యుద్ధం, పర్యావరణ విపత్తు, దారిద్ర్యం, అణచివేతల ముప్పు నుండి పారిపోయేందుకు ప్రయత్నించిన 500మందికి పైగా వలసదారులు గ్రీస్‌కు వాయవ్యంగా మధ్యధరా సముద్ర జలాల్లో మునిగిపోయి మరణించారని అధికారులు తెలిపారు. వీరిలో కొంతమంది ఆచూకీ కూడా లభ్యం కాలేదు. గత బుధవారం తెల్లవారు జామున వీరు ప్రయాణిస్తున్న బోటు బోల్తాపడడంతో ఈ విషాదం సంభవించింది. మరణించిన వారిలో 30నుండి వందమంది చిన్నారులు వున్నారు. గ్రీస్‌కు వెళ్ళేందుకు ఈనెల 10న లిబియాలోని టోబ్రెక్ వద్ద చేపల బోటులోకి దాదాపు 750మంది ఎక్కారు. రోజుల తరబడి సాగే ప్రయాణానికి అవసరమైన ఆహారం, నీరు వంటివి ఏమీ లేకుండానే వీరు బయలుదేరిపోయారు. బోటు ఓపెన్ డెక్‌పైన వందలాదిమంది కిక్కిరిసి కూర్చున్నారు. ఈమేరకు గ్రీస్ కోస్ట్ గార్డ్ అందచేసిన ఒక ఫోటో బయటకు వచ్చింది. ఇప్పటివరకు కేవలం 78మృత దేహాలను మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. 104మందిని మాత్రమే కాపాడగలిగారు. మిగిలిన వారి ఆచూకీ గల్లంతైంది. వారి కోసం బుధవారం నుండి సాగిన గాలింపు చర్యలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. ఈ వలస విధానానికి బాధ్యులైన అధికారుల వైఖరిని ఖండిస్తూ గ్రీస్‌లో గురువారం పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు జరిగాయి. వారిని పోలీసులు బాష్పవాయు గోళాలతో చెల్లాచెదురు చేశారు. పార్లమెంట్ వెలుపల కమ్యూనిస్టు పార్టీ నిరసన ప్రదర్శన నిర్వహించగా, ప్రాప్‌లియా యూనివర్శిటీ వెలుపల కూడా నిరసనలు చేపట్టారు.

ఇయు, గ్రీస్‌లపై విమర్శలు

ఈ విషాదంలో గ్రీక్ ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శించింది. సహాయక చర్యలు సత్వరమే చేపట్టేందుకు తిరస్కరించింది. దాంతో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో వున్నవారు సాయం కోసం అభ్యర్థించకపోయినా సముద్ర జలాల చట్టం కింద వెంటనే సహాయక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత వుందని ఓస్లో యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎరిక్ రోసెగ్ వ్యాఖ్యానించారు.

సమగ్ర వలస, ఆశ్రయ విధానాన్ని తీసుకురావడంలో విఫలమైనందుకు యురోపియన్ యూనియన్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా జరిగిన విషాదం స్థాయి భారీగా వుండడంతో గ్రీక్ ప్రభుత్వంపై, ఇయుపై ఒత్తిడి పెరిగింది. గ్రీక్ మాజీ ప్రధాని అలెక్సిస్ సిప్రాస్ ఇయు దేశాలపై తీవ్రంగా విమర్శలు చేశారు. వలసలు, ఆశ్రయంపై ఒక అంగీకారానికి వచ్చేందుకు ఇయులో సమూల మార్పులు జరగాలని ఆయన పిలుపిచ్చారు. తృతీయ ప్రపంచ దేశాల నుండి ఇయు సభ్య దేశాలకు వచ్చే శరణార్థులు సురక్షితమైన, చట్టబద్ధమైన మార్గాల్లో వచ్చేందుకు హామీ కల్పించాలని కోరారు.

మేఘాలయను ముంచెత్తుతున్న భారీ వర్షాలు

- విరిగిపడుతున్న కొండ చరియలు
- పలువురు మృతి

షిల్లాంగ్ : భారీ వర్షాలు మేఘాలయను ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో పలువురు మరణించారు. వెస్ట్ కాశీ హిల్స్ జిల్లాలో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడడం వల్ల ఒక ఇల్లు కూలిపోయింది. అందులో చిక్కుకుపోయి ఇద్దరు మైనర్లయిన అక్కాచెల్లెళ్ళు మరణించారని పోలీసులు తెలిపారు. శనివారం తెల్లవారు జామున 4.30గంటల సమయంలో జరిగిన ఈ దుర్ఘటనలో మృతులు 10, 15 ఏళ్ల వారని జిల్లా పోలీసు అధికారి తెలిపారు. మరో సంఘటనలో ఈస్ట్ ఖాశి హిల్స్‌లో ట్రక్కు పెద్ద గోతిలో పడడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మరణించారు. వారిలో నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. తూర్పు జైంటియా కొండ ప్రాంత జిల్లాలో కొండచరియలు విరిగిపడడంతో 6వ నెంబరు జాతీయ రహదారితో సంబంధాలు తెగిపోయాయి. తూర్పు అస్సాంలోని సిల్చర్, మిజోరాం, త్రిపురలను ఈ జాతీయ రహదారి కలుపుతోంది. వెంటనే రహదారిపై గల శిధిలాలను తొలగించామని, అయినా ప్రజలు అప్రమత్తంగా వుండాలని, ప్రత్యామ్నాయ మార్గాలు వుంటే వాటిని చూసుకోవాలని ఎస్‌పి జగ్‌పాల్ ధనోవా కోరారు. 12 జిల్లాలకు గానూ ఏడు జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో రాష్ట్ర విపత్తు నిర్వహణా దళాలను రంగంలోకి దింపారు.



మీ కోసం

ఇడ్లీ, దోశల పిండి పులవకుండా ఉండాలంటే పిండిపై తమలపాకు వేసి, చూడండి!

జీవనసౌరభం

చేసిన ప్రతి పనిలోనూ ఆనందం పొందలేకపోవచ్చు. కానీ, ఏ పనీ చేయకుండా మాత్రం ఆనందాన్ని పొందలేం.

ఎలుగుబంటి సలహా



ఒక అడవిలో పిల్ల ఏనుగు దారిలోని చెట్లను విరవసాగింది. ఆ దారినే వస్తున్న ఎలుగుబంటి అది చూసి 'ఓ గజమా! ఆ చెట్లను ఎందుకు? అలా విరుస్తున్నావు? మనల్ని కాపాడే మన అడవి చెట్లను విరవవచ్చా?' అనడిగింది.


అప్పుడు ఆ పిల్ల ఏనుగు 'నాకు ఎంత బలం ఉందోనని చూసుకుంటున్నాను. సింహం కన్నా నేను బలం గలదాన్ని అని నిరూపించుకోవాలి' అంది.

ఆ మాటలకు ఎలుగుబంటి నవ్వి 'సింహం అడవికి రాజు. అది ఉండటం వల్ల మానవులు ఈ చెట్లను నరకకుండా వెళ్లిపోతున్నారు. నువ్వేమో నీ బలం నిరూపించాలని చెట్లను నాశనం చేయడం మంచిది కాదు. నీ బలం చూసుకోవాలంటే దారికి అడ్డంగా ఉన్న కొండ రాళ్లను తొలగించు. దాంతో నీ బలం ఏంటో అందరికీ అర్థమయ్యి, మెచ్చుకుంటారు' అంది.

ఎలుగుబంటి చెప్పిన సలహా సబబుగా ఉండటంతో ఆలోచించింది ఏనుగు. అలాగే చేసి చూపిస్తా అని మనసులో అనుకుంది. తన బలంతో ఆ దారిలో ఉన్న రాళ్లను, ముళ్ల కంపను తొండంతో ప్రతిరోజూ కొంచెం కొంచెంగా తొలగించసాగింది. ఓ రోజు ఆ వైపు వచ్చిన మృగరాజు సింహం చూసి ఏనుగు చేస్తున్న మంచి పనిని ప్రశంసించింది.

వెంటనే పిల్ల ఏనుగులూ వచ్చి ఏనుగుకు సహాయపడ్డాయి. వాటికి చేతనైనంత పనిచేశాయి. అడవి జంతువులకు చెరువు దగ్గరకు వెళ్లే దారి ఏర్పరచాయి. దాంతో అడవిలో ఉన్న పులులు, సింహాలు, జింకలు, నక్కలు, గుర్రాలు, తోడేళ్లు అన్నీ కలిసి అభినందించాయి.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
99085 54535



దారి చూపండి !

చిన్నారులూ, పోస్టుమ్యాన్, పోస్టుబాక్స్ దగ్గరకు వెళ్లాలి. మరి దారి చూసి సాయం చేయరూ!

నేను గీసిన బొమ్మ



- చల్లా తేజస్విన్,
వివేకానంద హై స్కూలు,
పాలకొండ,
పార్వతీపురం,
మన్యం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రతి ఆడపిల్లా.. ఆత్మరక్షణ విద్య నేర్వాలి

కరాటే విద్యలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన లక్ష్మి సామ్రాజ్యం ... ఆడపిల్లలకు విద్య ఎంత అవసరమో.. ఆత్మరక్షణ విద్య కూడా అంతే అవసరమని అంటారు. ఆత్మరక్షణ విద్య చాలా సులభంగా నేర్చుకోవచ్చని చెబుతారు. తన ప్రయాణం గురించి ఆమె మాటల్లో..



పదో తరగతి చదువుతున్న అమ్మాయిని అదే క్లాసు చదువుతున్న అబ్బాయి రోడ్డుపై అటకాయించాడు. నీ పేరేంటని అడుగుతూ భుజంపై తాకాడు. అనుకోని ఆ సంఘటనకు ఆ పిల్ల భయంతో వణికిపోయింది. ఇంటికి వచ్చినా వణుకు తగ్గలేదు.. అవి ఫైనల్ పరీక్షలు జరుగుతున్న సమయం. జ్వరంతో బాధపడుతున్న ఆ పిల్ల పరీక్షలు రాసినా ఫెయిలైంది. ఆ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన ఆమె స్నేహితురాలు 'మేం ఎందుకు భయపడాలి? ఈ పరిస్థితికి కారణమేంటి? అమ్మాయిలను ఏడిపించాలన్న అబ్బాయిలు భయపడాలంటే ఏం చేయాలి?' అని ఆలోచించింది. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం జరిగిన సంఘటనైనా ఇప్పటికీ దాన్ని మర్చిపోని ఆమె ఆ తరువాత ఆడపిల్లల ఆత్మరక్షణ కోసం 'రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడెమీ' స్థాపించి సుమారు 25 ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మందికి ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నారు. ఆమె పేరు ఎన్ లక్ష్మి సామ్రాజ్యం.

"ప్రకాశం జిల్లాలో పుట్టిన నేను ప్రస్తుతం హైద్రాబాద్‌లో సెటిల్ అయ్యాను. రైతు కుటుంబంలో పుట్టాను. నాన్నకు పుట్టుకతోనే రెండు కళ్లూ కనిపించవు. మేం నలుగురు సంతానం. ముగ్గురు అక్కచెల్లెళ్లం, ఒక తమ్ముడు. నన్ను పోలీసు చేయాలన్నది నాన్న కల. కానీ అప్పట్లో మా ఊళ్లో సైకిల్ తొక్కడం కూడా చాలా తప్పు. ఆడపిల్లకు సైకిల్ అవసరమా అనేవారు. అలాంటి చోట చిన్నప్పటి నుండే కరాటేలో శిక్షణ తీసుకున్నాను. ఆడపిల్ల కరాటే నేర్చుకుని ఏం చేస్తుంది? ఎవరిని తంతుంది? అనేవారు. అయినా పట్టుదలతో నేర్చుకున్నాను. నాలుగేళ్లలో పూర్తిచేయాల్సిన కోర్సును రెండేళ్లకే ఫినిష్ చేశాను. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలిచ్చి ఎన్నో ప్రశంసలు అందుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో మూడు సార్లు బంగారు బహుమతులు అందుకున్నాను. కానీ ఏదో వెలితి నన్ను వెంటాడేది. పదో తరగతిలో నా స్నేహితురాలికి జరిగిన సంఘటన ఎప్పుడూ నన్ను తొలిచి వేసేది. కరాటే విద్య నేర్చుకున్న తరువాత నాలో ఎంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆత్మరక్షణ ఉండబట్టే నాపై నాకు నమ్మకం కలిగిందని బలంగా నమ్మాను. అందుకే నేను ఒక్కదాన్నే కాదు.. ప్రతి ఆడపిల్లా ధైర్యంగా ఉండాలి. ఒకపక్క యుద్ధ విమానాలు నడుపుతున్న మహిళలు.. మరోపక్క బయటికి రావాలంటేనే భయపడుతున్న మహిళలు సమాజంలో కనిపిస్తారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రతి ఒక్కరూ.. ఆడపిల్లలు తనకాళ్లపై తాను నిలబడాలంటే చదువొక్కటే మార్గమనుకుంటారు. కానీ ధైర్యంగా బయటికి రావాలంటే ఆత్మస్థైర్యమిచ్చే ఆత్మరక్షణ విద్య రావాలి. ఆ ఆలోచన నుండే నేను నేర్చుకున్న విద్య పదిమందికీ నేర్పించాలన్న లక్ష్యంతో మొదట్లో స్కూళ్లు, కాలేజీలు తిరుగుతూ అవకాశాలు వెతుక్కుని మరీ శిక్షణ ఇచ్చేదాన్ని.



నా మొదటి ప్రయాణం

కరాటే విద్యలో రాణిస్తున్నప్పుడే శిక్షకురాలిగా జూనియర్స్‌కి తర్ఫీదు ఇచ్చేదాన్ని. ఆ ప్రోత్సాహంతో శిక్షణ పూర్తయిన తరువాత హాస్టల్‌కి వెళ్లి అక్కడి పిల్లలకు కరాటే నేర్పించేదాన్ని. ఆదాయంతో పాటు నా కాళ్లపై నిలబడగలను అన్న ధైర్యం అప్పుడే వచ్చింది. అయితే శిక్షణ ఇస్తానని స్కూళ్లకు, కాలేజీలకు చాలాసార్లు తిరగాల్సి వచ్చేది. ఎన్నో తిరస్కారాలు ఎదురయ్యేవి. 'వద్దమ్మా ఆడపిల్లలకు అలాంటివి నేర్పించడానికి తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదు. చదువుంటే చాలు.. కరాటే నేర్చుకుంటే పెళ్లిళ్లు అవుతాయా అని భయపడుతున్నార'ని కొన్ని యాజమాన్యాలు ఒప్పుకునేవి కావు. అయినా, నా ప్రయత్నాలు ఆపేదాన్ని కాదు.



రుద్రమదేవి గొప్ప స్ఫూర్తి..

దాదాపు 25 ఏళ్లుగా ఆత్మరక్షణ విద్యలో లక్షల మందికి తర్ఫీదునిస్తున్నా. అకాడెమీ కల అలాగే ఉండిపోయింది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి 2016లో 'రుద్రమదేవీ సెల్ఫ్ డిఫెన్స్ అకాడెమీ'నీ రిజిస్టరు చేయించాను. రుద్రమదేవీ అంటే నాకు చాలా ఇష్టం. మా ఐదో పాఠంలో ఆమె గురించి ఉండేది. ఇప్పటికీ ఆ పాఠం సంఖ్య గుర్తుందంటే ఆ పాఠం నాపై ఎంత ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు. విలువిద్య నేర్చుకున్న రాణి రుద్రమ మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఆ పాఠం చదువుతున్నంతసేపూ ధైర్యవంతురాలైన మహిళ తన చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అనిపించేది. అందుకే అకాడెమీకి ఆమె పేరే పెట్టాను.

నామమాత్రపు ఫీజుతో..

అకాడెమీకి వచ్చే పిల్లలకు, మహిళలకు నెలకు రూ.500లు ఫీజుతో శిక్షణ ఇస్తుంటాను. వారి ఆసక్తిని బట్టి కాలపరిమితి ఉంటుంది. అంగన్వాడీ, ఆశా, ఎల్ఐసి, ఆర్‌టీసీ వంటి ప్రభుత్వరంగ మహిళా ఉద్యోగుల్లో ఎంతోమందికి శిక్షణ ఇచ్చాను. పేద పిల్లలకు, అనాథాశ్రమాల నుండి వచ్చేవారికి, వృద్ధులకు ఉచితంగా నేర్పిస్తున్నాను.

పోలీసు రంగంలోని వారికి కూడా ...

ఎంతోమంది అధికారులకు కూడా సెల్ఫ్ డిఫెన్స్‌లో తర్ఫీదునిచ్చాను. నేను పోలీసునైతే.. ఎక్కడో ఒక ప్రాంతానికే పరిమితమైపోయేదాన్ని. కానీ ఈ శిక్షణ ఇవ్వడం ద్వారా ఎంతోమంది పోలీసులకు శిక్షణ ఇచ్చే స్థాయికి వచ్చాను. తెలంగాణలో షీ టీమ్ సిబ్బందికి కూడా శిక్షణ ఇచ్చాను. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు నా సేవలను గుర్తించి పలు అవార్డులు, ప్రశంసలు అందించాయి.

ఒకేసారి వేలాదిమంది ప్రదర్శనలిచ్చి, గిన్నీస్ రికార్డు, ప్రపంచ రికార్డులను సాధించాము. పలు టీవీ షోలలో, సోషల్ మీడియా వేదికలపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాను. "

- జ్యోతిర్మయి

ప్రతి ఇంటి నుంచీ ఒకరు రావాలి

ఆడపిల్లలను ఇంటినుండి బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. చుట్టూ నేరాలు పెరిగిపోయాయి. చదువు, ఉద్యోగం పేరుతో ఆడపిల్లలు సుదూరాలు వెళుతున్నారు. వారందరికీ ఆత్మరక్షణ విద్య అవసరం. జపాన్, చైనా, మలేషియా లాంటి దేశాల్లో ప్రతి ఇంట్లో ఆడపిల్లలు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణులై ఉంటారు. మనదేశంలో కూడా ఆ విధానం రావాలి. అప్పుడే దాడులు తగ్గుతాయి. ఆత్మరక్షణ ఉంటేనే ఆత్మస్థైర్యం ఉంటుంది. లక్షల మంది మహిళలకు శిక్షణ ఇచ్చిన నేను భవిష్యత్తులో అకాడెమీ ద్వారా మరింతమందికి తర్ఫీదునివ్వాలి. ఆత్మరక్షణ ఒక్కటే కాకుండా మహిళల ఉపాధికి ఉపయోగపడే పలు రకాల రక్షణ, మల్లయుద్ధ విద్యలను కూడా నేర్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

'భోళా శంకర్' డబ్బింగ్ మొదలైంది




చిరంజీవి హీరోగా నటిస్తున్న 'భోళా శంకర్' సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఈ సినిమాలో కీర్తి సురేష్ చిరంజీవికి చెల్లెలుగా కనిపించనుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు మొదలయ్యాయని తెలుస్తోంది. డబ్బింగ్ పనులు షూరూ చేసినట్లు కీర్తి తన ఇన్స్టాగ్రామ్‌లో వెల్లడించారు.. ఈ మేరకు మెహర్ రమేష్‌తో ఉన్న ఫోటోను పోస్టు చేశారు. ఈ సినిమా తమిళ చిత్రం 'వేదాళం'కు రీమేక్‌గా తెరకెక్కుతోంది. దాదాపు పదేళ్ల తర్వాత మెహర్ ఈ సినిమా చేస్తున్నారు. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను ఏకే ఎంటర్‌టైనమెంట్స్, క్రియేటీవ్ కమర్శియల్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

జులై 7న 'భాగ్ సాలే'




'మత్తు వదలరా', 'తెల్లారితే గురువారం', 'దొంగలున్నారు జాగ్రత్త' వంటి సినిమాలతో ఇండస్ట్రీలో అడుగుపెట్టిన యువ నటుడు శ్రీ సింహ కొత్త ప్రాజెక్టు 'భాగ్ సాలే'. ప్రణీత్ బ్రహ్మాండపల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యశ్ రంగినేని అర్జున్ దాస్యన్, సింగనమల కల్యాణ్ నిర్మిస్తున్నారు. నేహా సోలంకి కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీ ప్రకటించారు. జులై 7వ తేదీన ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. జీవితంలో ఓ లక్ష్యాన్ని పెట్టుకొని దానిని సాధించడానికి ఓ వ్యక్తి ఏం చేశాడు అనే కథాంశంతో ఈ మూవీని తెరకెక్కించారు.

'మామన్నమ్' ట్రైలర్ విడుదల




తమిళ దర్శకుడు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో 'మామన్నమ్ అనే పొలిటికల్ థ్రిల్లర్ సినిమా తెరకెక్కుతోంది. ఉదయనిధి స్టాలిన్, ఫాహద్ ఫాజిల్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో మేకర్స్ మామన్నమ్ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఒక పొలిటీషియన్‌కు, సాధరణ మధ్య తరగతి తండ్రికి మధ్య జరిగే రివేంజ్ స్టోరీలా ఈ సినిమా కథాంశం ఉండనున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమౌతోంది. కీర్తిసురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను రెడ్ జియాంట్ బ్యానర్‌పై ఉదయనిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూన్ 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.




అంబేద్కర్, పెరియార్ పుస్తకాలు చదవండి..

'భవిష్యత్తు ఓటర్లు మీరే. భవిష్యత్తు నాయకులను ఎన్నుకోవాల్సిందీ మీరే. ఇప్పుడున్న రోజుల్లో వ్యవస్థ ఎలా మారిందంటే.. డబ్బు ఇచ్చిన వాళ్లకే కొంతమంది ఓటర్లు ఓట్లు వేస్తున్నారు. ఒక వ్యక్తి ఓటు కోసం అధిక మొత్తంలో డబ్బు ఇస్తున్నాడంటే.. గతంలో అతడు ఎంత డబ్బు సంపాదించాడో అర్థం చేసుకోండి. కాబట్టి, డబ్బు తీసుకుని ఓటు వేయొద్దని విద్యార్థులందరూ తమ తల్లిదండ్రులకు చెప్పండి. అలా జరిగితే అందరికీ ఉన్నత విద్య లభిస్తుంది. ఇక, ఇప్పుడున్న యుగంలో సోషల్‌మీడియా వేదికగా కొంతమంది ఫేక్‌న్యూస్‌లు సృష్టిస్తుంటారు. వాటి వెనుక కొన్ని అజెండాలు కూడా ఉంటాయి. వాటిని అర్థం చేసుకోవడం కోసం అంబేద్కర్, పెరియార్ వంటి గొప్ప నాయకుల పుస్తకాలు చదవాలి' అని విజయ్ ఓ కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తూ 'ఆల్ ఇండియా దళపతి విజయ్ మక్కల్ ఇయక్కం' ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. చెన్నై వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్ పైవిధంగా స్పందించారు.

'సందేహం'తో వస్తున్న హెబ్బాపటేల్



హెబ్బా పటేల్ నటిస్తున్న 'సందేహం' చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ని తాజాగా మేకర్స్ విడుదలచేశారు. విష్ణు వర్షిణి క్రియేషన్స్ బ్యానర్‌పై సత్యనారాయణ పర్చా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఊరికి ఉత్తరాన' సినిమా ఫేమ్ సతీష్ పరమవేద దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సుమన్ వూటుకూరు హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పనులు కంప్లీట్ చేసుకొన్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్ వేగవంతం చేసిన మేకర్స్.. సినిమా సోల్ తెలిసేలా ఫస్ట్ లుక్ పోస్టర్ డిజైన్ చేశారు. 'సందేహం' అనే టైటిల్‌కి షి బిలీవ్డ్' అనే ట్యాగ్ లైన్ జోడించారు. సుభాష్ ఆనంద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో హెబ్బా పటేల్ పాత్ర మేజర్ అట్రాక్షన్ కానుందని తెలుస్తోంది.



ఈ రోజే కాజల్-60 అప్డేట్

కాజల్ కెరీర్‌లో 60వ సినిమాగా రాబోతున్న ప్రాజెక్ట్ గురించి తాజాగా ఓ ప్రకటన విడుదలైంది. ఈ మూవీ టైటిల్, టీజర్ నేడు ఆదివారం విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ప్రీ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అందులో కారు కిటికీ నుంచి కాజల్ గాజులు ధరించిన చేయి బయటపెట్టగా అద్దంలో ఆమె లుక్ కనిపిస్తోంది. ఎప్పుడూ చూడని లుక్‌లో కాజల్‌ను చూపిస్తున్నాం అంటూ మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను ఔరం ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారని తెలుస్తోంది. ఈ సినిమా డైరెక్టర్, ఇతర నటీనటుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

సాత్విక్, చిరాగ్ జోడి రికార్డు


- తొలిసారి ప్రపంచ టూర్ సూపర్-1000 ఫైనల్‌కు
- సింగిల్స్‌లో ప్రణయ్ రాయ్ ఓటమి



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్-చిరాగ్ జోడీ రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో కొరియా జోడీని ఓడించి తొలిసారి ప్రపంచ టూర్ సూపర్-1000 ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 17-21, 21-19, 21-18 తేడాతో ఎం.హెచ్. కాంగ్-ఎస్.జే. సియో(దక్షిణ కొరియా) జోడీని చిత్తుచేసి టైటిల్ పోరుకు అర్హత సాధించారు. ఈ క్రమంలో సూపర్-1000 టోర్నమెంట్ ఫైనల్‌కు చేరిన తొలి భారత షట్లర్ల జోడీగా రికార్డు సృష్టించారు. క్వార్టర్స్‌లో 21-13, 21-13 తేడాతో టాప్ సీడ్ ఫజర్ అల్ఫియాన్-మహమ్మద్ రియాన్ (ఇండోనేసియా)పై విజయం సాధించి సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. ఆదివారం జరిగే ఫైనల్లో 2వ సీడ్ మలేషియాకు చెందిన ఆరోన్-షో వుయ్‌లతో తలపడనున్నారు. వీరు రెండో సెమీస్ 12-21, 23-21, 21-13తో ఇండోనేషియా జోడీని ఓడించారు. మరోవైపు, పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్‌కు నిరాశే ఎదురైంది. టాప్ సీడ్ అక్సెల్సెన్(డెన్మార్క్)తో జరిగిన సెమీస్‌లో 21-15, 21-15 తేడాతో ఓటమిపాలయ్యాడు. అక్సెల్సెన్ ఫైనల్‌లో లీ షిఫెంగ్(చైనా)-ఆంథోనీ సినిసుకా గింటింగ్(ఇండోనేషియా) మ్యాచ్ విజేతతో టైటిల్‌కై తలపడనున్నాడు. ప్రణయ్ క్వార్టర్స్‌లో 21-18, 21-16 తేడాతో మూడో సీడ్ కొడాయ్ నరోకా (జపాన్)పై విజయం సాధించి సెమీస్‌లోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. భారత ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌లో, మహిళల సింగిల్స్‌లో పివి సింధు రెండో రౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లోకి స్పెయిన్‌కు చెందిన 6వ సీడ్ కరోలినా మారిన్, 4వ సీడ్ చైనాకు చెందిన చెన్-యుఫీ ప్రవేశించారు. మారిన్ 21-12, 21-11తో 8వ సీడ్ ఇంటనాన్(థాయ్‌లాండ్), చెన్-యుఫీ 21-8, 21-17తో 2వ సీడ్, కొరియాకు చెందిన అన్-సె-యంగ్‌లను ఓడించారు.

ఖవాజా సెంచరీ


ఆస్ట్రేలియా 311/5



బర్మింగ్‌హామ్: యాషెస్ సిరీస్‌లో భాగంగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఉస్మాన్ ఖవాజా సెంచరీతో కదం తొక్కాడు. దీంతో ఆస్ట్రేలియా జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 5వికెట్ల నష్టానికి 311పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 14పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన ఆస్ట్రేలియా జట్టు ఓపెనర్ వార్నర్(9), లబూషేన్(0), స్మిత్(16) తక్కువ స్కోర్‌కే పెవీలియన్‌కు చేరారు. ఆ తర్వాత హెడ్(50), క్యారీ(52నాటౌట్) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. ఖవాజా(126నాటౌట్) సెంచరీతో కదం తొక్కాడు. బ్రాడ్, మొయిన్ అలీకి రెండేసి, స్టోక్స్‌కు ఒక వికెట్ దక్కాయి.

లబూషేన్ టెస్టుల్లో తొలిసారి గోల్డెన్ డక్..

ఐసిసి టెస్ట్ బ్యాటర్స్ నంబర్ వన్ ఆటగాడు మార్నస్ లబూషేన్ టెస్టుల్లో తొలిసారి గోల్డెన్ డక్ అయ్యాడు. డేవిడ్ వార్నర్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన లబూషేన్ బ్రాడ్ వేసిన తొలి బంతికి బెయిర్‌స్టోకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఐదేళ్ల టెస్టు కెరీర్‌లో లబూషేన్ గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేరడం ఇదే తొలిసారి. 2018లో పాకిస్థాన్‌పై లబూషేన్ టెస్టుల్లో ఆరంగేట్రం చేశాడు.



బంగ్లాదేశ్‌దే సిరీస్

ఏకైక టెస్ట్‌లో ఆఫ్ఘన్‌పై 546పరుగుల తేడాతో గెలుపు

ఢాకా: అఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 546పరుగుల తేడాతో గెలిచింది. బంగ్లా జట్టు టెస్టులో ఇంత భారీ పరుగుల తేడాతో గెలవడం ఇదే తొలిసారి. ఓవర్ నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 45పరుగులతో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆఫ్ఘనిస్తాన్ జట్టు నాలుగో రోజు ఆట 115 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 382 పరుగులు చేయగా.. అఫ్ఘాన్ జట్టు 146 పరుగులకే చేసిన సంగతి తెలిసిందే. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాజట్టు 4 వికెట్ల నష్టానికి 425 పరుగులు రాబట్టి డిక్లేర్ చేసింది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ నజ్ముల్‌కు లభించింది. దీంతో ఆఫ్ఘన్ జట్టు 662 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది.

రెండు బెర్తులు.. రేసులో 10జట్లు

నేటినుంచి వన్డే ప్రపంచకప్ అర్హత టోర్నీ

హరారే: ఈ ఏడాది చివర్లో భారత్ వేదికగా జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో చోటు కోసం క్వాలిఫై మ్యాచ్‌లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొత్తం 10జట్ల మధ్య ప్రధాన టోర్నీకి ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8ఉన్న జట్లు ఇప్పటికే అర్హత సాధించాయి. మిగిలిన రెండు బెర్తుల కోసం మూడుసార్లు టైటిల్ విజేత వెస్టిండీస్, ఒకసారి టైటిల్‌ను ముద్దాడి శ్రీలంక జట్లు ప్రధాన రేసులో ఉన్నాయి. వీటితోపాటు ఆతిథ్య జింబాబ్వే, ఐర్లాండ్, నేపాల్, నెదర్లాండ్స్, ఓమన్, స్కాట్లాండ్, యుఏఇ, అమెరికా జట్లు బరిలో ఉన్నాయి. మొత్తం 34 వన్డేలు జరగనుండగా.. టాప్-2 స్థానాల్లో ఉన్న ప్రధాన టోర్నీకి అర్హత సాధిస్తాయి. మొత్తం 10జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. రౌండ్ రాబిన్ లీగ్ ముగిసిన అనంతరం టాప్-3 జట్లు సూపర్-6లో తలపడతాయి. అగ్రస్థానంలో నిలిచి రెండుజట్లు ప్రధాన టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఆదివారం జింబాబ్వే-నేపాల్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో క్వాలిఫై మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68